నవంబర్ - 2025

# హన్నాకృప

ఆధ్యాత్మిక మాస పత్రిక


**సంపాదకులు :**

**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర**
B.A.,B.L.,


**చందా వివరాలు :**

**సంవత్సర చందా రూ. 350/-**
పోషక చందా రూ. 1500/-
జీవితచందా రూ. 5000/-


**చిరునామా :**


ఎడిటర్, హన్నాకృప
పోస్ట్‌బాక్స్ నెం.51, క్లాపేట, 6వలైను
ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా
సెల్ : 9440217726


**బ్యాంకు అకౌంటు వివరాలు :**

A/c Name: **K. Emmanial Rajendra**
A/c No.: **10957294340**
Bank: SBI Main Branch, Ongole
IFSC Code : SBIN0000890

## విషయసూచిక


| | | |
|---|---|---|
| సంపాదకీయం | కె.ఇ. రాజేంద్ర | 02 |
| జప్పత్వనేహు | కొడవటికంటి | 03 |
| నా చిత్తానుసారుడు | కొడవటికంటి | 05 |
| దున్నపోతు మీద వర్షం | కె.ఇ. రాజేంద్ర | 07 |
| విశ్వాసము లేకుండా... | హన్నాకృప డెస్క్ | 08 |
| నీ సృష్టికర్త | హన్నాకృప డెస్క్ | 09 |
| నా రక్షకుడు | సాక్ష్యము | 10 |
| బైబిల్ ప్రాముఖ్యత | హన్నాకృప డెస్క్ | 13 |
| మదర్ తెరీసా | వై. ప్రసాద్‌రావు | 15 |
| తల్లిదండ్రులారా! | కె.ఇ. రాజేంద్ర | 17 |
| క్రీస్తును నేర్చుకొనుట... | డా॥ సుష్మ, నెల్లూరు | 19 |
| నా కుటుంబము | స్త్రీల కొరకు | 20 |
| తగిన సమయం | చిన్నపిల్లల పేజి | 22 |
| బైబిల్ పదవినోదం-11 | | 24 |


సీరియల్ నంబరు

సంపాదకీయం....

# గాలికై ప్రయాసపడవద్దు

హన్నాకృప పాఠకులకు ప్రభువు నామమున వందనములు.

సూర్యుని క్రింద జరిగే క్రియలన్నీ వ్యర్థములని, అవి గాలిని పట్టుకోడానికి ప్రయాసపడినట్టే ఉన్నాయని జ్ఞానియైన సొలొమోను తన అనుభవముతో పలికిన మాటలు. మనిషి ఈ భూమ్మీద జన్మించి, మరణించే వరకు తాను చేసే పనులన్నీ కూడా వ్యర్థములు అని తేల్చి చెప్పాడు. *"సూర్యుని క్రింద నరునికి తటస్థించు ప్రయాసమంతటి చేతను, వాడు తలపెట్టు కార్యములన్నిటి చేతను, వానికేమి దొరుకుచున్నది? వాని దినములన్నియు శ్రమకరములు, వాని పాట్లు వ్యసనకరములు, రాత్రియందైనను వాని మనస్సునకు నెమ్మది దొరకదు; ఇదియు వ్యర్థమే" (ప్రసంగి 2:22,23).* మనిషి యొక్క జీవిత పరమార్ధాన్ని కాచి వడపోసినట్లుగా సొలొమోను తేల్చి చెప్పాడు. మనిషి ఈ భూమ్మీద జీవించే అతి స్వల్పకాలమంతయు దేవునికి దూరంగా జీవించి, దేవుడు మనిషిని సృష్టించిన ఉద్దేశ్యాన్ని నిరర్థకం చేస్తున్నాడు. ఎవరైతే తమ జీవితాలలో దేవునికి చోటిస్తారో, ఎవరైతే దేవుని వలన జీవిస్తారో వారు మాత్రమే సుఖసంతోషాలతో జీవిస్తారు. మిగిలిన వారందరి జీవితాలు గాలికై ప్రయాస పడినట్లుగా భారంగా ఆయాసకరమైన జీవితం జీవిస్తారు. ప్రసంగి గ్రంథములో చూచినట్లయితే మహాజ్ఞానియైన సొలొమోను ఈ భూమి మీద జరిగే అనేక విషయాల మీద మనసుపెట్టి ప్రతి విషయాన్ని గురించి ఆలోచించి, పరిశీలనగా తెలుసుకున్నాడు. ఆయన పరిశీలనలో చివరకు తేల్చినది ఏమిటంటే, భూమి మీద ప్రతి ఒక్కరూ దేవునికి లోబడియుండి వారి ఆయుష్కాలము పూర్తి చేసుకోవాల్సిందే. ఈ భూమి మీద మనిషి జన్మకు పరామార్థం అదే అని తేల్చి చెప్పాడు. *"ఇదంతయు వినిన తరువాత తేలిన ఫలితార్థమిదే; దేవునియందు భయభక్తులు కలిగియుండి ఆయన కట్టడలననుసరించి నడుచుచుండవలెను. మానవకోటికి ఇదియే విధి" (ప్రసంగి 12:13).* దేవునియందు భయభక్తులు లేకుండా తమ ఇష్టానుసారంగా, ధన సంపాదనే ధ్యేయంగా జీవించే వారి జీవితాలు గాలికై ప్రయాసపడినట్లే ఉంటాయి. గాలిని పట్టుకోవాలనుకోవడం ఎంతటి మూర్ఖత్వమో, దేవున్ని తిరస్కరించటం అంతకంటే మూర్ఖత్వం. మరి మన జీవితాలు ఎలా ఉంటున్నాయి? దేవునియందు భయభక్తులు కలిగి ఆయనకు లోబడి జీవిస్తున్నామా? లేక గాలిని పట్టుకోవడానికి ప్రయాసపడుతున్నామా? తేల్చుకోవాల్సింది మనమే. *"శ్రమయును గాలికైన యత్నములును రెండు చేతులనిండ నుండుట కంటె ఒక చేతినిండ నెమ్మది కలిగియుండుట మేలు" (ప్రసంగి 4:6).* మనం ఈ భూమి మీద జీవించే డెబ్బై లేదా ఎనభై సంవత్సరాల కాలాన్ని మనం ఎలా వెళ్ళబుచ్చుతున్నాము? 'దేవునియందు భయభక్తులు కలిగి ఆయన కట్టడలను పాటించాలి, మానవులందరికి ఇది విధి' అని సొలొమోను చెప్పిన దానిని ఎంతమంది పాటించగలుగుతున్నారు? దేవునియందు భయభక్తులు లేకుండా తమ ఇష్టమొచ్చినట్లు లోకానుసారంగా జీవించే వారు పడే పాట్లకు, అనుభవించే బాధలకు, కష్టాలకు బాధ్యత వహించాల్సింది ఎవరికి వారే. దేవుడు మనుష్యులందరిని యథార్థవంతులుగానే పుట్టించాడు. అయితే ఎవరికి వారు వివిధ తంత్రములు కల్పించుకొని గాలికై ప్రయాసపడుతున్నారు. మరి మీరు దేవునియందు భయభక్తులు కలిగి ఉంటారో, గాలికై ప్రయాసపడతారో మీరే నిర్ణయించుకోవాలి.

**-కొడవటికంటి ఇమ్మానియేల్ రాజేంద్ర, ఎడిటర్**

**K. Emmanial Rajendra, SBI Main Branch, Ongole**
**A/c No. 10957294340**

# జప్నత్పనేహు



(యోసేపు జీవిత చరిత్ర)

– కొడవటికంటి

ఆసెనతు ప్రక్కన లేని వెలితి కనబడుతుంది. చిన్న కళ్ళలో ఈ గొప్ప పిరమిడ్ అమర్చుకొని ఏమి మాట్లాడేది? ఇప్పుడిప్పుడే కొంచెం, కొంచెం దేవుని గురించి బయటకు మాట్లాడుతుంది. పెళ్ళి అయిన క్రొత్తలో తన దేవుని గురించి తెలియనట్లుగా ఉండేది. కాని మూగ హృదయంలో దేవునికున్న స్థానము తనకు తెలియకుండానే బయటపెట్టేది. తాను గర్భం ధరించినట్లు మొదటిసారి గ్రహించినప్పుడు 'దేవుడు మనకు బహుమానం ఇవ్వబోతున్నాడు' అని అన్నప్పుడు ఆమె దేవుని గురించి ఎంత లోతుగా ఆలోచిస్తుందో అర్థం చేసుకోగలిగాడు తను. అదే విధంగా విశ్రాంతి మందిరం నిర్మించిన ఆ శిల్పిని గురించి మాట్లాడుతూ, 'దేవుడు మనుషులకు ఎంత జ్ఞానం ఇచ్చాడు!' అంది.

ఈ దేశం వచ్చినవారు, ఎంతదూరం నుండి వచ్చినా ఈ లోకం అంతా చూసిన తృప్తి కలుగుతుంది. ఎందుకంటే ఇక్కడి జ్ఞానం ఎక్కడనుండో అరువు తెచ్చుకున్నది కాదు. లోక నివాసులు ఇక్కడి నుండి జ్ఞానాన్ని ప్రపంచాన్నంతటికి తీసుకొని వెళ్ళారు. అబ్రాహాముగారిని దేవుడు పిలిచి 'నేను నీకు చూపించు దేశమునకు వెళ్ళుము' అన్నప్పుడు దేవుని ఉద్దేశంలో అబ్రాహాముగారికి ఈ ఐగుప్తును కూడా చూపించాలని ఉండి ఉంటుంది. ఇక్కడి నుండి వెనక్కు వెళ్ళమని దేవుని ఆజ్ఞ కదా..!

అంతలో తన తండ్రి యాకోబు గుర్తుకు వచ్చాడు. హృదయాన్ని పిండివేసినట్లయి పోయింది. తనకు రాజ్యాధికారం ఇవ్వబడిననాటి నుండి, తన తండ్రి అనేకమారులు జ్ఞప్తికి వచ్చాడు. తన తండ్రిని పిలవాలనుకున్నాడు. కాని ఇంత కాలం దేవుని చిత్తం కొరకు ఎదురు చూచి, ఇప్పుడు తన ఇష్టానుసారంగా చెయ్యాలా? నా తండ్రి మరణించక మునుపు ఆయనను ఒకసారి చూపించమని ఆ దేవున్ని ఎన్నిసార్లు బ్రతిమాలుకోలేదు. ప్రేమ కలిగిన దేవుడు ఆ కోరిక తీర్చలేడా? ఆయనకు అది ఇష్టం లేదా? చెరసాలలో నుండి సింహాసనం ఎక్కించిన దేవుడు ఇది చేయడా? దేవా! నీయందు నా నిరీక్షణ తొలగిపోకుండా కాపాడు. అనుకుంటూ కళ్ళలోని నీళ్ళను కళ్ళలోనే నొక్కివేసుకున్నాడు.

ఆనాటి ఫరో తన పితరుని, ఐగుప్తు నుండి పంపించినప్పుడు అబ్రాహాము తన మునిమనుమడు ఈ దేశాన్ని పరిపాలిస్తాడు అని అనుకున్నాడా? తన రథానికి ముందు యాభై మంది యవ్వనస్థులు పరుగెడుతున్నారు. వీరు తను ప్రయాణం చేసినంత దూరం ఈ విధంగా పరుగెత్తవలసినదే. తను వీరి ఆచారాలను మార్చుటకు... కాదు, వాటిని కొనసాగనివ్వటం, వారిని గౌరవించటం అవుతుంది. తన వెంట వస్తున్న అకాసియా చెట్లు ఆగిపోయాయి. ఇంతవరకు ప్రయాణం చేసిన ఐగుప్తు నల్లని మట్టి బాట ఆగిపోయింది. ఇక్కడి నుండి ఎడారి. తను ఇప్పుడు పదిమైళ్ళు ప్రయాణం చేశాడన్నమాట. రథం ఆగిపోయింది. ఇక్కడ నుండి ఒంటెల మీద ప్రయాణం. తన ప్రయాణం కొరకు సైన్యం బయలు దేరితే, ఇలా ఉంటుంది కాబోలు అనుకున్నాడు. చిన్నతనంలో తన తండ్రితో ఒంటె మీద ప్రయాణం చేసాడు. అయితే ఇప్పుడు తన ప్రయాణం వేరు. ఒక వ్యక్తి కొరకు ఇంతమంది వేచియుండాలా? అనుకున్నాడు.

ఒంటె మీద ఎక్కడానికి, కూర్చోవడానికి అన్నీ సున్నితమైన ఏర్పాట్లు. ఎండ తగలకుండా, దుమ్ము తన శరీరం తాకకుండ అంబారి అమర్చబడింది, పసిబిడ్డను కాపాడినట్లుగా, ఒంటె మీద తను కూర్చుంటే, ఒంటె లేచి నిల్చునే విధము ఒక విధంగా విసిరి వేసినట్లుగా అనిపిస్తుంది. కొత్తవారు తట్టుకోలేరు. తన బానిస జీవితంలో పొందిన అనుభవం. ఇప్పుడు అలుపు లేకుండా, ఇతరుల సాయం ఎక్కువ అవసరం లేకుండానే తను ఐగుప్తు అంతా ప్రయాణించబోతున్నాడు.

ఒంటె మీద ప్రయాణం చేస్తున్నంతసేపు తను తన అన్నల నుండి దూరం అయినప్పుడు, ఇప్పుడు తన క్రింద నడుస్తున్న వారిలో ఒకనిగా ఉన్నాడు. అందువలన తన క్రింద నడుస్తున్న బానిసలను ప్రేమగా చూడగలుగుతున్నాడు. వారికి తను ఏమి చెయ్యనవసరం లేదు. వారివైపు ప్రేమగా చూస్తే చాలు. వారికి వరాలు ఇచ్చినట్లు భావిస్తారు. వారు కూడా మనుష్యులే అనే భావన మన కళ్ళలో కనబడినా, మనల్ని దేవుళ్ళు అనుకుంటారు.

ఒంటెలు నాలుగు, గాడిదలు పది, నడిచేవారు యాభైమంది, వందమంది సైనికులు కదలి పిరమిడ్ వైపుగా బయలుదేరారు. అది వారి ఆనవాయితి. మొదట ఫినిక్స్ వద్దకు చేరారు. తను థేమాను వలన వినినది అంతా అబద్ధం అనిపించింది. అతను పిరమిడ్ల గురించి ఫినిక్స్ గురించి చెప్పిన దానికి, తను చూస్తున్న దానికి అసలు సంబంధం లేదు. ఏ మానవుడు కూడా పిరమిడ్‌ని చూడకుండా దాని ఔన్నత్యాన్ని గుర్తించలేడు. మానవుడు దీనిని నిర్మించాడు అంటే నమ్మలేము. దగ్గర నిలబడి పిరమిడ్‌ని చూచినప్పుడు మనకు కలిగే భావన చెప్పటానికి, వ్రాయడానికి ఈ ప్రపంచంలో ఎవ్వరికి చేతకాదు. ప్రతి మనిషి తన జీవితంలో పిరమిడ్‌ను చూడగలిగితే, అతను ఆశీర్వదించబడినవాడే. తను ఈ దేశాధికారి కాకముందు ఇలా ఈ పిరమిడ్‌ని చూడగలిగితే ఇంకా అదృష్టవంతుడై ఉండేవాడు. ఎందుకంటే తను ఆ పిరమిడ్ మీదకు ఎక్కి ఉండేవాడు. తను ఒక్క అడుగు వేస్తే పది అడుగులు తన వెంటపడుతుంటాయి.

థేమాను ఇప్పుడు ప్రక్కన, ఒక ఒంటె మీద కూర్చొని ఉన్నాడు. జప్నత్తు వైపు చూచి, "ఈ చియోప్స్‌కి ఎక్కడ విగ్రహాలు లేవు. కనుక ఈ పిరమిడ్, అన్ని కాలములకు, కొలతలకు సూచన అని అనిపిస్తుంది. అదీకాక పిరమిడ్ అంటే అర్థం ఏమిటంటే ధాన్యకొలమాలిక (ఫిరోస్ అనగా ధాన్యము. మెట్రొస్ అనగా కొలత) ఈ పిరమిడ్ ఐగుప్తులో ఉన్నప్పటికిని, ఇది ఐగుప్తుకు సంబంధించినది కాదు కదా! ఐగుప్తు యొక్క విగ్రహారాధనకు వ్యతిరేకంగా నిలబెట్ట బడింది. బహుశా దీనిని మెల్కీసెదెకు కట్టించి యుండాలి. గొర్రెల కాపరి అనగా ఫిలిస్టియన్, అనగా పాలస్తీనాలో నుండి వచ్చినది. అక్కడ ఆ కాపరియైన రాజు, సర్వోన్నతుని యాజకుడై దైవప్రేరణ వలన విగ్రహారాధనకు వ్యతిరేకంగా వీటిని కట్టించి యుండవచ్చును" అని అన్నాడు.

"తన తండ్రి ఐగుప్తును మనెహ్రూ అని పిలిచేవాడు. వారి తండ్రులు, హెబ్రీయులందరు ఐగుప్తును మనెహ్రూ అంటారు. మనెహ్రూ అంటే పిరమిడ్ల దేశమని అర్థం. ఈ పిరమిడ్లు కట్టబడిన ఇనుమువంటి రాళ్ళు తెచ్చిన బాట చాలా పెద్దది. పదిమైళ్ళు. ఆ బాట మీద నడవాలనిపించింది. కాని థేమాను ఒప్పుకోలేదు. "మీరు నడవటానికి బదులు గాడిద మీద ప్రయాణం చేస్తే మంచిది. మీరు అలసిపో కూడదు" అన్నాడు థేమాను. ఆ బాట మొత్తం మెరుగుపెట్టిన రాతితో వేయబడింది. అయినా గాడిద కాళ్ళు జారలేదు. ఎందుకంటే ఇసుక దానిమీద కప్పబడి ఉంది. **(సశేషం)**

**ఫోన్‌పే ద్వారా లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపించాలంటే క్రింది క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి**

Scan & Pay Using PhonePe App

Emmanial Rajendra

# నా చిత్తానుసారుడు

(దావీదు జీవిత చరిత్ర)

– కొడవటికంటి

అబ్నేరు చేతిలోని పత్రిక తీసికొని చదివింది. అది దావీదు ఇష్బోషెతుకు వ్రాసినది. ప్రక్కనే ఉన్న పల్తీయేలు ఆ ఉత్తరం చదివి మీకాలు చేయి పట్టుకొని లోపలికి తీసుకొని వెళ్ళాడు. పల్తీయేలు తండ్రి లాయీషు వచ్చి సంగతి తెలుసుకొని పల్తీయేలుతో మీకాలును పంపించెయ్యమన్నాడు కాని పల్తీయేలు ఒప్పుకోలేదు.

అబ్నేరు ముందుకు వచ్చి "మీరు ఇప్పుడు మీకాలును పంపించకపోతే మరలా అంతర్యుద్ధం సంభవిస్తుంది. ఆ యుద్ధంలో ఇశ్రాయేలు సైన్యం నాశనమౌతుంది. ఇష్బోషెతు ఈ సంగతి ఆలోచించి మిమ్ముల్ని దావీదు యొద్దకు చేర్చమని నన్ను పంపించారు. మీరు రాకపోతే తీసికొని పోవలసి యుంటుంది" అన్నాడు.

మీకాలు కొంచెంసేపు ఆలోచించింది. కళ్ళ వెంబడి నీళ్ళు కాలువయింది. ఏమి మాట్లాడలేదు. వెనక్కి తిరిగి చూడలేదు. గబగబా పల్లకిలో ప్రవేశించి తల రెండు మోకాళ్ళ మధ్య పెట్టుకొని వెక్కిళ్లు పెడుతుంది. ఆమెను పలకరించటానికి సైనికులు ఎవర్ని దగ్గరకు రానీయలేదు.

వెంటనే పల్లకి బయలుదేరింది. ముందు గుఱ్ఱం మీద అబ్నేరు వెళ్తుంటే వెనుక పల్లకి వస్తుంది. సైనికులు పల్లకి వెనుక గుఱ్ఱాల మీద వస్తున్నారు. ఊరి పొలిమేర వరకు మీకాలు స్నేహితురాళ్ళు వచ్చి ఆగిపోయారు.

పల్తీయేలు పల్లకి కిటికి వద్ద దగ్గరగా నడుస్తున్నాడు. కొంచెంసేపు పిచ్చివానివలె చూస్తుంటాడు. కొంచెంసేపు పెద్దగా నవ్వుతాడు. కొంచెంసేపు మీకాలు మీకాలు అని పిలుస్తాడు. పల్లకి మోసేవాళ్ళు నిదానంగానే నడుస్తున్నారు. ఊరి గవిని దాటిన తర్వాత మీనా వేగం పుంజుకొంది. ఒక్కసారిగా పల్తీయేలు నిశ్చేష్టుడై నిలచిపోయాడు. పల్లకి మోసేవాళ్ళ లయబద్ధమైన అరుపులో లోపల మీకాలు ఎలా ఉందో ఎవరికి తెలియదు. ఉన్నట్లుండి ఒక్కసారిగా మీకాలు మీకాలు అంటూ ఏడుస్తూ పల్లకిని పట్టుకొని లాగుతున్నాడు.

ముందు వెళ్తున్న అబ్నేరు గుఱ్ఱాన్ని పక్కకి లాగి ఆగాడు. పల్తీయేలును చూసి "నువ్వు తిరిగి వెళ్ళు" అన్నాడు. పల్లకి కదలిపోతుంది. పల్తీయేలు అలానే చూస్తూ ఉన్నాడు. అబ్నేరు పల్తీయేలును చూస్తున్నాడు. పల్తీయేలు అబ్నేరును చూసి వెనక్కు తిరిగాడు. అబ్నేరు ముందుకు కదిలాడు. హెబ్రోనుకు ఇంకా ముప్పయి మైళ్ళు ప్రయాణం వుంది అనుకున్నాడు.

రెండు రోజుల్లో అబ్నేరు ఇశ్రాయేలీయుల పెద్దలను వెంటబెట్టుకొని వస్తాడని కబురు వచ్చింది. దేవుడు ఇంత తొందరలో అబ్నేరును ఇష్బోషెతును దూరం చేస్తాడని అనుకోలేదు. నిజానికి అబ్నేరు ఇశ్రాయేలీయులకు రాజుగా ప్రకటించుకొని ఇష్బోషెతును చెరలో ఉంచినా ఎవరూ పట్టించుకోరు. ఇది దైవ నిర్ణయమే.

దావీదు తన ఇంటి వైపుగా నడుస్తున్నాడు. మనసు పరిపరివిధాలై పోతున్నది. కొంచెంసేపు ఇశ్రాయేలీయులు ఏకమవటం, సైన్యాధిపతి ఎవరు? అనుభవజ్ఞుడు, యోగ్యుడైన అబ్నేరా? యవ్వనుడైన యోవాబా? అబ్నేరులోని నిజాయితీ యోవాబులో లేదని అనిపిస్తుంది.

దూరంగా అబీగయీలు తన వైపే చూస్తుంది. తన ఆరుగురు భార్యలలో సలహా ఇవ్వగలిగినా, ప్రేమించినా అబీగయీలే. ఎప్పుడైనా 'ఇంటికి వెళ్తున్నాను' అనుకుంటే అబీగయీలు దగ్గరకు వెళ్తున్నానని అర్థం. దావీదు చిన్నగా నవ్వుకున్నాడు. వెనుక నడుస్తున్న దేహసంరక్షకులు. ఇవన్ని ఏమి గ్రహిస్తారు? వారి కనుదృష్టి ఎప్పుడు తన మీద ఉండదు. తన చుట్టు తన దగ్గర నుండి ఎంత దూరము నుండి తనకు అపాయం సంభవించగలదో అంత దూరం వారి కనుదృష్టి పారి యుంటుంది.

ఆమె ముఖంలో సంతోషం కనిపిస్తుంది. ఒక్కింత

ఆశ్చర్యం కనబడుతుంది. తన రాజవస్త్రాలు అందుకుంటూ దావీదు ముఖంలోకి చూసింది. ఆ ముఖంలో ఏమి మార్పు కనిపించలేదు. ఒక్కింత ఆలోచనలో ఉన్నాడు అనుకుంది.

"అబీ, ఏమిటి అలా చూస్తున్నావు?" అన్నాడు.

సన్నగా నవ్వి మౌనంగా పానీయం అందించింది.

"ఏమిటదోలా ఉన్నావు?" అన్నాడు కొంచెం మెత్తగా కొంచెం గట్టిగా.

"మీరిలా వచ్చారేమిటా? అని" అంది ప్రక్కన కూర్చుంటూ.

"ఏమి?" అన్నాడు.

"మీకాలు...." అంది.

"ఓ మీకాలు.... ఔను, అబ్నేరు చెప్పాడు. మర్చిపోయాను" అన్నాడు దావీదు.

"మర్చిపోయారా?" అన్నది నిజంగా ఆశ్చర్యపోతూ "మీరు ఈ రాత్రి అక్కడే ఉంటారనుకున్నాను" అంది వినీ వినబడని రీతిలో.

"అబీ, ఒక పరాయి వానితో పదిహేనేండ్లు కాపురం చేసిన దానితో... ఎలా అనుకున్నావు?" అన్నాడు.

"మరెందుకు తీసుకొచ్చారు?" అంది కళ్ళలోకి చూస్తూ.

"అది రాజకీయం. సౌలు సంతానమంతా మరణిస్తేనో లేక నాయింట ఉంటేనో కాని సంపూర్ణమైన రాజ్యస్థాపన జరగదు. అయినా మీకాలు నా యొద్ద విడాకులు తీసుకొనలేదు. ఆమె ఇంకా నా భార్యే. నా వస్తువు ఎక్కడ వున్నా అది ఇక్కడికి చేరవలసిందే కదా. దాన్ని నేను ఉప యోగించినా లేకపోయినా" అన్నాడు. "మీరు ఎక్కువ సంతోషంగా ఉన్నప్పుడు కాని ఎక్కువ భారంగా ఉన్నప్పుడు కాని నాకు దగ్గరలో ఉంటారు" అంది. "అలానా? అయితే ఇప్పుడు రెంటిలో ఏది?" అన్నాడు నవ్వుతూ. "మొదటిది ఇశ్రాయేలు పన్నెండు గోత్రాలకు మీరు రాజు కాబోతున్నారు. కాబట్టి. రెండవది మీకాలు వచ్చింది కాబట్టి" అంది. "అందుకే అబీ, నిన్ను నేను సరిగా అర్థం చేసు కున్నాను. అప్పుడు పాపం చెయ్యకుండా, నిరపరాధుల రక్తం నిష్కారణంగా చిందించినందుకు చింతించకుండా నన్ను నీవు అడ్డుకున్నందుకు  నీకు నా హృదయంలో ఎన్నడూ చెరగని స్థానం ఉంది" అన్నాడు.

"అందుకేనా" అంది అలిగినట్లుగా అటు తిరిగి.

దావీదు ఆమె వైపు తిరిగి భుజం పట్టుకొని గడ్డం క్రింద వ్రేలితో ముఖం పైకెత్తి ఆమెను చూస్తూ "ఇంత అందమైన ముఖంలో అంత లోతుగా భవిష్యత్తును ఆలోచించే హృదయం వుందా అని అప్పుడప్పుడు ఆశ్చర్య పోతూ ఉంటాను సుమీ" అన్నాడు.

ఆమె ముఖం వెలిగింది. మరలా కావాలని ఆ వెలుగును ఆర్పుకుంటున్నట్లుగా నటిస్తూ "అప్పుడప్పుడు" అంది ప్రతి అక్షరాన్ని వత్తి పలుకుతూ.

దావీదు నవ్వాడు. ఇప్పుడు హృదయపూర్వకంగా నవ్వాడు. అందుకేనేమో దేవుడు స్త్రీని సృజించింది. ఈ హృదయ వేదన ఇంత తొందరగా పోగొట్టుకోవటానికే కాబోలు ఈ సాటియైన సహాయిని అనుకున్నాడు.

అబీగయీలు ఇటు తిరిగి "ఏమండి, ఏమైంది?" అంది.

"ఇంకా ఏమి కాలేదుగా. అప్పుడప్పుడు అన్నందుకు నిజమేగా, నీకు తోడు ఇంకా ఐదుగురు వున్నారని" అన్నాడు.

"ఇప్పుడు ఆరుగురు కదా!" అంది చిన్నగా.

"లేదు అబీ, లేదు ఆ భావన రానీయకు. ఒకప్పుడు ఈ నిర్మలమైన గొఱ్ఱెల కాపరి హృదయం ద్రవింపజేసి, మలచి రూపుదిద్దింది మీకాలే. కాని అది నటన, ద్రోహము, కపటము. ఈ రాజరికం లేకపోతే మీకాలును మరి ఎన్నడూ చూచియుండే వాడను కాదు" అన్నాడు దావీదు.

అబీగయీలు చలించింది. దావీదుకు దగ్గరగా వచ్చి "ఆమె తప్పేముంది. సౌలు రాజు ఆమెను ఇంకొకరికి ఇచ్చి వివాహము చేస్తే" అంది.

"అలా అనవద్దు. ఆ వివాహం ఆమె తప్పించు కోవాలంటే  ఎన్నో దారులు ఉన్నాయి. యోనాతానుతో ఒక్కమాట చెప్తే మీకాలును నా యొద్దకు తీసికొని వచ్చి యుండేవాడు" అన్నాడు.

**(సశేషం)**



# ‘దున్నపోతు మీద వర్షం’



వర్షం పడినప్పుడు ఏ మనిషైనా తడకుండా ఏ చెట్టు కిందకో, పంచలోకో పోతారు. జంతువులైతే వర్షం పడనట్టు గానే చలనం లేకుండా ఉంటాయి. మనం ఎవరికైనా ఏదైనా చెప్పినప్పుడు వెంటనే స్పందించకపోతే ‘ఎంత చెప్పినా ఉలుకు పలుకు లేకుండా దున్నపోతు మీద వర్షం పడ్డట్టు ఉంటావేంటి’ అని అంటుంటాము. మనుష్యులకి జంతువు లకి తేడా తెలియడానికి ఈ సామెత వాడతారు. ప్రస్తుతం బైబిలు చదివే విషయంలో ఈ సామెత వాడదాము. మీ జీవితకాలంలో బైబిలు గ్రంథం మొత్తం ఒక్కసారన్నా చదివారా? ఒకవేళ చదవకపోతే అందుకుగల కారణాలు ఏంటో చెప్పగలరా? ఈ రోజుల్లో బైబిలు ఒక అలంకార ప్రాయంగానే మారింది. చర్చికి వెళ్ళేటప్పుడు తీసుకెళ్ళడానికి తప్ప వ్యక్తిగతంగా చదవటానికి ఎవరూ ఉపయోగించటం లేదు. బైబిల్లో 66 పుస్తకాలుంటాయని చాలామందికి తెలియదు. దేవుడు ఇచ్చే వాగ్దానాల కోసం కీర్తనలు, యెషయా గ్రంథము తప్ప బైబిలు మొత్తం పూర్తిగా చదివే వాళ్ళే లేరు. ‘ఈ ధర్మశాస్త్రగ్రంథమును… దానిలో వ్రాయ బడిన వాటన్నిటి ప్రకారము చేయుటకు నీవు జాగ్రత్తపడు నట్లు దివారాత్రము దాని ధ్యానించిన యెడల నీ మార్గమును వర్ధిల్లజేసికొని చక్కగా ప్రవర్తించెదవు’ (యెహోషువ 1:8). బైబిలును మనం దివారాత్రము ధ్యానిస్తే మనకే మంచిది తప్ప దేవునికి ఒరిగేదేమి లేదు. పరిశుద్ధ గ్రంథము నేడు మనకు అందుబాటులో మన ఇంట్లోనే ఉంటుంది. టి.వి.లో సినిమాలు, సీరియల్స్ చూడటానికి, స్కూల్, కాలేజీ చదువులకు సంబంధించి పుస్తకాలు చదవడానికి చూపించే ఆసక్తి మన జీవితాలను మార్చివేసే జీవగ్రంథానికి ఇవ్వటంలేదు. ఇంటర్నెట్‌లో వాట్సాప్, ఫేస్‌బుక్, యూట్యూబ్ వాడటానికి ఎంత సమయం కేటాయిస్తారో, మన జీవితానికి ఉపయోగపడని వాటికోసం సమయం ఎంత వృధా చేస్తున్నారో, ఆ వృధాచేసే సమయంలో కొంత బైబిలు గ్రంథం చదవడానికి కేటాయించలేకపోతున్నారంటే సాతానుకి ఎంతగా బంధీలుగా మారిపోతున్నారో అర్థం చేసుకోవచ్చు. మనుష్యులను బైబిలు చదవనీయకుండా దేవునికి దూరం చేయడానికి సాతాను పన్నిన కుట్రలో అందరూ చిక్కుకొని దిగ్విజయంగా సాతానుని గెలిపిస్తు న్నారు. ఆపకుండా బైబిలు చదివి పూర్తి చేయడానికి 72 గంటలు పడుతుంది (మూడురోజులు). ప్రతిరోజు 5 అధ్యాయాలు చదివితే సుమారు ఏడు నెలలు పడుతుంది. 5 అధ్యాయాలు చదవడానికి 30 నిమిషాలు పడుతుంది. దేవునికోసం ఆ మాత్రం సమయం కేటాయించలేరా? అనారోగ్యంతో ఉన్నప్పుడో, కష్టకాలంలోనో బైబిలు చదవటం కాదు. ప్రతిరోజూ బైబిలు చదవడం అలవాటు చేసుకోవాలి. ఈ లోకముతో మనం బిజీగా ఉండి బైబిలు చదవడం బోరు కొడుతుందని, అర్థం కావడంలేదని, మర్చి పోతున్నామని అనేకమైన కారణాలు చెప్పడం అర్థరహితం. రాబోవు రోజులలో దేవుని వాక్యము దొరకని కాలము వస్తుంది. అప్పుడు దేవుని వాక్యమును వెదకినా దొరకదు. మనఃస్ఫూర్తిగా బైబిలు పూర్తిగా చదవాలి అనుకుంటే దేవుడు తప్పక సహాయం చేస్తాడు. ‘యెహోవా గ్రంథమును పరిశీలించి చదువుకొనుడి’ (యెషయా 34:16) అని దేవుడే స్వయంగా చెప్పినా వినకపోతే ఏమనుకోవాలి? వర్షం మనిషి మీద పడిందో, దున్నపోతు మీద పడిందో ఎవరికి వారే డిసైడ్ చెయ్యాలి. **‘దున్నపోతు మీద వర్షం’** కాదు మనిషి మీదనే అనుకుంటే బైబిలు గ్రంథాన్ని పూర్తిగా చదవడాన్ని ఒక సవాలుగా తీసుకుని నేడే చదవటం ప్రారంభించండి. దేవుడు మీకు తప్పక సహాయపడతాడు.

**ఫోన్‌పే లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపవలసిన ఫోన్ నంబరు**

**9 4 4 0 2 1 7 7 2 6**

# విశ్వాసము లేకుండా...

**“విశ్వాసము లేకుండ దేవునికి ఇష్టుడైయుండుట అసాధ్యము; దేవుని యొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడనియు, తన్ను వెదకు వారికి ఫలము దయచేయు వాడనియు నమ్మవలెను గదా” (హెబ్రీ.11:6).**

విశ్వాసమనే పదమునకు బైబిలు గ్రంథంలో చాలా ప్రాధాన్యత ఉంది. విశ్వాసము ‘డాలు’తో పోల్చబడింది. అనగా విశ్వాసమంటే పోరాటమని అర్థం. ఈ పోరాటము ఈ లోకములో జీవించేటప్పుడు శరీరాశ, నేత్రాశ, జీవపుడంబము అనే వాటితో పోరాడాల్సి ఉంటుంది. *“జయించు వానిని నాతో కూడా నా సింహాసనమునందు కూర్చుండనిచ్చెదను”* అని ప్రకటన 3:21లో వ్రాయబడిన ప్రకారము, మనం జయించాల్సింది ఈ లోకమును. ఈ లోకాన్ని జయించాల్సి ఆయుధం విశ్వాసము. హెబ్రీయులకు 11వ అధ్యాయంలో అనేకమంది విశ్వాస వీరుల గురించి వ్రాయబడింది. వారంతా దేవునియందలి భయభక్తులతో విశ్వాసం కలిగి జీవించినందు వల్ల విశ్వాస వీరుల జాబితాలో చేరారు. *“విశ్వాసమనునది నిరీక్షింపబడు వాటి యొక్క నిజస్వరూపమును, అదృశ్యమైనవి యున్నవనుటకు రుజువునై యున్నది” (హెబ్రీ. 11:1).* నిరీక్షణ లేని చాలామంది క్రైస్తవులు తాము దేవుడంటే చాలా విశ్వాసం కలిగియున్నామని భ్రమపడుతుంటారు. చర్చికి వెళ్ళటం, ప్రార్థన చేసుకోవడం, బైబిలు చదవటం ఇవన్నీ తమ విశ్వాసానికి ప్రమాణాలుగా భావిస్తుంటారు. అన్నీ సక్రమంగా జరిగినంత కాలము అందరూ దేవునిపట్ల విశ్వాసం చూపిస్తూనే ఉంటారు. కానీ కష్టాలు, బాధలు, వేదనలలో దేవున్ని విశ్వసించరు. మేము దేవున్ని ఇంతగా ఆరాధిస్తున్నాం కదా, మాకెందుకు ఇన్ని కష్టాలు, బాధలు అని నిష్ఠూరంగా మాట్లాడతారు. అందుకు కారణం దేవున్ని నమ్మితే మాకు కష్టాలు, బాధలు లేకుండా చేస్తాడని, తమ కోరికలన్నీ తీరుస్తాడని ఎంతో నమ్మకంతో ఉండటమే. వారి విశ్వాసంతో సంబంధం లేకుండా దేవుడు వారికి దీవెనలు కుమ్మరించాలని, వాళ్ళ గొంతెమ్మ కోరికలన్నీ తీర్చాలని ఎదురు చూస్తుంటారు. దేవుడు తగిన సమయమందు దయచేస్తాడు అన్న నిరీక్షణ లేకుండా వాళ్ళు అనుకున్నవి జరగకపోయినా, వాళ్ళకి కీడు జరిగినా దేవున్ని వదిలేస్తుంటారు. అందుకే యేసుప్రభువు మత్తయి 17:21లో ‘ఆవగింజంత విశ్వాసము’ అని విశ్వాస పరిమాణము గురించి చెప్పాడు. కంటికి కనిపించని ఆవగింజంత విశ్వాసం కలిగి ఉండటమే గొప్ప అనే కదా అర్థము. *“మనుష్యకుమారుడు వచ్చునప్పుడు భూమి మీద విశ్వాసము కనుగొనునా?” (లూకా 18:8)* అని అనుమానం వ్యక్తం చేయటంలో విశ్వసించడమనే ప్రక్రియ ఎంత కష్టంతో కూడుకున్నదో అర్థమవుతుంది. అలాంటప్పుడు ఇప్పుడు మనం దేవునిపట్ల చూపించే విశ్వాసం నిజమైనదో కాదో, ఆవగింజలో అర్థభాగమైనా ఉందో లేదో మనం పరీక్షించుకోవాలి. మన విశ్వాసాన్ని మనం పరీక్షించుకోవాలంటే బైబిలు చదవాలి. బైబిలు పరిజ్ఞానం లేకపోతే మనం విశ్వాసంలో బలపడలేము. దేవునికి ఇష్టులుగా ఉండాలంటే తగినంత విశ్వాసం కలిగి ఉండాలి. ఒకవేళ మన విశ్వాస పరిమాణం దేవుని దృష్టిలో తగినంతగా లేకపోతే విశ్వాసమునకు కర్త, దానిని కొనసాగించువాడునైన యేసువైపు చూచుచు దేవుని యందలి భయభక్తులతో జీవిస్తూ మన విశ్వాసాన్ని పెంపొందించుకుందాము. తగినంత విశ్వాసము కలిగి దేవునికి ఇష్టులుగా ఉండటానికి మీరు సిద్ధమేనా?

**సాక్ష్యాలకు ఆహ్వానము**

మీ జీవితాలలో దేవుడు చేసిన మేలులను ఇతరులకు తెలియపరచుట ద్వారా దేవుని నామానికి మహిమ కలగడమే కాక వినినవారు విశ్వాసంలో బలపడుటకు మీ సాక్ష్యం ఉపయోగపడవచ్చు. కావున మీ అమూల్యమైన సాక్ష్యాలు మాతో పంచుకొనిన యెడలవాటిని సంతోషంగా పత్రికా ముఖంగా ప్రచురించుటకు మేము సిద్ధంగా ఉన్నాము. దేవుని నామ ప్రకటనలో మాతో పాటు మీరు పాలి భాగస్తులు కావాలని ఆశిస్తున్నాము.

# నీ సృష్టికర్త

మానవుని సృష్టి, అంటే మానవ దేహ నిర్మాణం, దాని పనితీరు ఒక అద్భుతమైతే మానవుని అంతరంగము మహా అద్భుతమనడంలో అతిశయోక్తి లేదు.

భూమి మీద ఏ ఒక్కరికి కనిపించని అంతరంగము ప్రతి ఒక్కరికి ఉంటుంది. అంతరంగాన్ని ఏ కన్ను వీక్షించలేక పోయినా జీవిస్తున్న ప్రతి దేహము అంతరంగాన్ని దాని తాలుకా ప్రభావాన్ని నిత్యం అనుభవిస్తూనే ఉంటుంది.

ప్రతి మనిషిలో ఉండే ఒక అదృశ్య భాగం అంతరంగం. ఈ అంతరంగం ఒక్కో మనిషికి ఒక్కోలా ఉంటుంది. దానినే అంతరంగ స్వభావం అంటాము. ఈ అంతరంగము యొక్క స్వభావాన్ని అనుసరించే మనస్సులో ఆలోచనలు రూపుదిద్దుకుంటాయి.

కయీను అంతరంగం వ్యసనపూరితమైనది. దేవుడు తనను తన అర్పణను అంగీకరించలేదనే బాధకంటే హేబెలు అర్పణను అంగీకరించటాన్ని భరించలేకపోయాడు. ఫలితంగా అతని మనస్సులో పుట్టిన ఆలోచనలు అతనిని హంతకున్ని చేశాయి.

మనిషి గుణగణాలుగా పరిగణించేదానిని వాని అంతరంగ స్వభావము అనవచ్చు. ఈ అంతరంగము దేవుడు కేవలం మానవులకు మాత్రమే ఇచ్చిన అంతరింద్రియం. దేవుని ఈ ఆశ్చర్యకరమైన సృష్టి నీవేంటో ఇతరులకు తెలియచేస్తుంది. నీకు నీ తోటివారికి కూడా తెలియని అంతరంగాన్ని కలిగి పైకి మంచివారిగా నటించేవారు లేకపోలేదు.

“నరుని ఆత్మ యెహోవా పెట్టిన దీపము అది అంతరంగ ములన్నియు శోధించును” సామెతలు 20:27

ఎంతో నటనా ప్రావీణ్యత కలిగిన వారమైనను మన అంతరంగము యొక్క లోతుపాతులను సృష్టికర్తయైన దేవుడు ఇట్టే కనిపెట్టగలడు.

ఈ భూమ్మీద జీవిస్తున్న ప్రతి వ్యక్తి ఒక ప్రత్యేకమైన అంతరంగ స్వభావాన్ని కలిగి ఉంటాడు. అందుకే ప్రతి ఒక్కరు ఒక ప్రత్యేకమైన వ్యక్తిత్వాన్ని కలిగి జీవిస్తుంటారు.

అయితే దేవుడు మానవునికి ఈ అంతరంగాన్ని ఇవ్వడంలో ఉద్దేశాన్ని గ్రహించగలిగినవారు మాత్రమే దేవుడు తమని ( తమ అంతరంగాన్ని) చూస్తున్నాడు అనే తలంపు కలిగి జీవిస్తారు.

మనం చేసే మంచి, చెడు పనులు మాత్రమే కాదు, మన ఆలోచనలలోని మంచి చెడులను, వాటితో పాటు ఆ ఆలోచనలు పుట్టుటకు కారణమైన మన అంతరంగాన్ని దేవుడు చూడగలడు, చూస్తున్నాడు అని గ్రహిస్తారో వారు యథార్థమైన జీవితం జీవిస్తారు.

“ దేవుడు నరులను యథార్థవంతులనుగా పుట్టించెను గాని వారు వివిధమైన తంత్రములను కల్పించుకొని యున్నారు” ప్రసంగి 7:29

దేవుడు యథార్థమైన, నిష్కపటమైన అంతరంగము కలిగిన వారముగా మనలను పుట్టించినప్పటికి ముష్యులు దేవుని సృష్టి యొక్క ఉద్దేశాన్ని, సృష్టికర్త గొప్పతనాన్ని గ్రహించక రకరకాల మనస్తత్వాలను కలిగి వారికి నచ్చిన విధంగా ప్రవర్తించుటకు పూనుకొని జీవితాలను ఛిద్రం చేసుకుంటున్నారు.

ఏ మనిషి, ఏ యంత్రము చూడలేని మానవ అంతరంగాన్ని దేవుడు సృష్టించి ఇవ్వడం ఒక అద్భుతం. కొన్నిసార్లు ఆ అంతరంగాన్ని కలిగియున్న వ్యక్తి కూడా దానిని గ్రహించలేడు. అందుకే తన ప్రవర్తన గూర్చి పశ్చాత్తాప పడుతుంటాడు.

“సాధవైనట్టియు, మృదువైనట్టియునైన గుణమను అక్షయాలంకారము గల మీ హృదయపు అంతరంగ స్వభావము మీకు అలంకారముగా ఉండవలెను; అది దేవుని దృష్టికిమిగుల విలువగలది” 1పేతురు 3:4

సాక్ష్యము

# నా రక్షకుడు

శ్రీ చింతలపూడి బుచ్చి రంగారావు
14వ నంబరు వస్త్రలత షాపు, విజయవాడ – 1.

వ్యాపారస్తుల కుటుంబంలో, హైందవ విగ్రహారాధనలో, పూజలు పునస్కారాలు సందడిలో నా బాల్యం, విద్యాభ్యాసం గడిపింది. 1957లో వివాహం. నలుగురు కుమారులు, ఏకైక పుత్రిక శాంతి. ఆమె పేరున మా షాపు ప్రభువు దయలో వర్థిల్లుతుంది. ప్రథమ పుత్రుడు జడ్జిగా ఏలూరులో రెండవ బాబు నా వ్యాపారంలో ఉండగా మూడవ అబ్బాయి గిరి కర్నూలులో వైద్య విద్య యం.బి.బి.యస్ వెళ్ళి తన ప్రియమైన స్నేహితుడైన జోయల్ అనే క్రైస్తవ యువకునితో పరిచయం అయింది కేవలం క్రైస్తవ్యం గూర్చి గ్రహించడం ప్రభువు గొప్ప ప్రేరేపణ నడిపింపుగా భావిస్తూ మా కుటుంబీకులమంతా క్రీస్తును స్వీకరించి, మేమంతా క్రీస్తు అడుగుజాడలలో సాగలేకున్న క్రీస్తు అనుచరలంగా ఉన్నాము. మా అబ్బాయి గిరి సహధ్యాయుడు జోయల్ మంచి క్రైస్తవ సాంప్రదాయ పద్ధతిలో మంచి నారుమడిగా క్రీస్తు వాక్యాన్ని హృదయంలో భద్రపరచుకొన్నాడు.

“యౌవనస్తులు దేనిచేత తమ నడత శుద్ధి పరచు కొందురు? నీ వాక్యమును బట్టి దానిని జాగ్రత్తగా చూచుకొనుట చేతనే కదా?” కీర్తనలు 119:9.

యోసేపు, దానియేలు, షద్రక్ మేషాకు అబేద్నెగో వలె ధైర్యంతో క్రీస్తును నమ్మి విశ్వాసులుగా విద్యాభ్యాసంలో మండిన మంటతో మీరు లోకమునకు వెలుగు, ఉప్పుగా ఉన్నారు. ప్రతి క్రైస్తవుడూ ఎలా ఉండాలో గిరి చెప్పేవాడు. మత్తయి 7:7 ప్రార్థనా పరుడైయుండి, దేవుని అడిగే వారుగా ఉండాలి అనేవాడు.

వినుట వలన విశ్వాసం కలుగును. రోమా 10:17, విశ్వాస వీరుడైయుండాలి నమ్మిన విశ్వాసాన్ని మా అబ్బాయి మాతో పంచుకొనేవాడు. కానీ మేమంతగా పట్టించుకోలేదు. 2 తిమోతి 4:2.

మా అబ్బాయి క్రొత్త విశ్వాసంతో చాలా నిబ్బరంగా ధైర్యంగా ఉండేవాడు. 1కొరింథీ 15:58 స్థిర విశ్వాసిగా నిశ్చల భక్తిలో ఉంటూ మా యెడల చాలా ప్రేమతో వినయ విధేయతలతో మెలిగేవాడు. మత్తయి11:29. రోమా 10:13, ప్రభువు నామమునుబట్టి ప్రార్థన చేయువాడెవడో వాడు రక్షింపడును. మా అబ్బాయి రక్షణ గూర్చి విన్నాము. మాకు కోపం ద్వేషం కల్గలేదు. ఎవరియిష్టం వారిది. గొప్ప చదువులో ఉన్నాడు. తప్పు చేయరనే భావనతో ప్రేమతోనే ఉన్నాము.

మా గిరి డాక్టరుగా చదువు పూర్తిచేసి డాక్టరు చదివే విద్యార్థులకు అధ్యాపకునిగా ఛండీఘర్ హర్యానాలో చేరాడు. అక్కడే చదువుకుంటున్న అమ్మాయి మా అబ్బాయి జీవితాన్ని గమనించింది. నీ గురించి నీవు ఆలోచించుకో నీ గూర్చి ఎవరూ ఆలోచించరు. ఇతరుల గూర్చి ఆలోచించు, ఇతరులు నీ గూర్చి ఆలోచిస్తారు. ప్రేమించబడాలనే తృష్ణ తీరాలంటే నీవు ప్రేమించడం నేర్చుకోవాలి. స్వార్థంతో, స్వనీతితో, స్వలాభంతో శరీరేచ్ఛలతో ప్రేమించే ప్రేమ నిజమైనది కాదు. నిస్వార్థమైన నిష్కళంకమైన క్రీస్తు ప్రేమ పొంది, ఇతరులను ప్రేమిస్తే ప్రేమించబడతాము.

“శాశ్వతమైన ప్రేమతో నేను నిన్ను ప్రేమిస్తున్నాను. గనుక నీ యెడల విడువక కృప చూపుచున్నాను” యిర్మీయా 31:3.

దేవుని కుమారుడైన క్రీస్తు ప్రేమామయుడు అందరి కొరకు ప్రాణాన్ని శిలువలో సమర్పించి పాతిపెట్టబడి పునరుత్థానుడై సజీవంగా మనలో, మనతో ఉన్నాడని గిరి విద్యార్థులతో తన విశ్వాసాన్ని బహిరంగ సాక్షమివ్వడంతో హర్యానా యువతి వివాహానికి ముందుకు వచ్చింది. గిరి ఆమెతో సంప్రదించాడు.

"నేను క్రైస్తవ నమ్మకముతో ఉన్నాను. నీవు కూడా నమ్మితేనే వివాహం చేసికుంటాను" అని గిరి ప్రశ్నకు ఆమె సమ్మతించింది. వారి తలిదండ్రులు హిందీ మాట్లాడే వారు. నా వాళ్ళు, ఆ అమ్మాయి బలగం సమ్మతితో చాలా నిరాడంబరంగా విగ్రహాలు లేకుండా పూజలు ఆచారాలకు దూరంగా దండల మార్పిడితో పరిశుద్ధ వివాహం జరిగింది. వారిద్దరూ మన దేవుడు గొప్పవాడు మనకు దేవుడు (రోమా 8:3) మనలో ఉన్న దేవుడు (ఫిలిప్పీ. 2:13) మనతో ఉన్న దేవుడు (ఆదికాండం 28:15) మనయందున్న దేవుడు (నిర్గమ 13:21) మన వెనుక ఉన్న దేవుడు (నిర్గమ. 14:1-19) మనపైన ఉన్న దేవుడు (ద్వితీయో. 33:27 మన చుట్టూ ఉన్న దేవుడు (కీర్తన 125:2) మనపైగా ఉన్న దేవుడు (పరమ. 2:4). మా అబ్బాయి, కోడలు క్రైస్తవులుగా నేడు అమెరికాలో ఫ్లోరిడాలో ఉంటూ విరామ సమయంలో క్రీస్తే దేవుడని సజీవుడని వాక్య ప్రబోధం చేస్తూ క్రీస్తుకు సాక్షులుగా ఉంటున్నారు. దేవునికి స్తోత్రం.

గతంలో వారు ఇంగ్లాండులో ఉండే రోజుల్లో తల్లి దండ్రులముగా నేను నా సతీమణి వారి వద్ద మూడు నెలలు గడిపి వారి విశ్వాసాన్ని చూచి వారి ప్రేమను పొందుకున్నాము. యేసు ప్రభువు గూర్చి వివరంగా విన్నాము. మాటయిచ్చిన దేవుడు, యెషయా 7:14, మాట యిచ్చి మరణించిన దేవుడు మత్తయి 27:50, మాట యిచ్చి సమాధినుండి లేచిన దేవుడు మత్తయి 28:7, రెండవసారి రానున్న దేవుడు, అపొ॥కార్య. 1:11.

ఇంగ్లాండులో ఉన్న మూడు నెలలూ మా గిరి, అతని భార్యతో కలసి క్రైస్తవ దేవాలయాలెన్నో దర్శించాము. ఆరాధనలో పాల్గొన్నాము. ఆ తర్వాత యింటికి ఇండియా వచ్చేసాము. మా అబ్బాయి క్రీస్తును స్వీకరించిన పది సుదీర్ఘ సంవత్సరాలు కన్నీటి ప్రార్థన, బోధల ఫలితం మాలో దైవ ప్రేరణ పనిచేయు నారంభించింది. మాకు దగ్గరగా ఉన్న ప్రబోధ బుక్ సెంటర్ దగ్గరగా ఉన్న ఒక దేవాలయాన్ని దర్శించాము అక్కడ క్రీస్తు బోధల్ని ఆంధ్ర క్రైస్తవ కీర్తన పాటలు పాడువిధాన్ని నేర్చుకున్నాము. బైబిలు కొనుక్కొని చదవడం ఆరంభించాము. మా అబ్బాయి గిరి అమెరికాలో ఉంటూ మా భార్యతో సహా నేను కూడా క్రైస్తవ్యాన్ని స్వీకరించి క్రీస్తును నమ్మి బాప్తిస్మాన్ని తీసికొని నమ్మకంగా నేటి వరకు ప్రభువు ప్రేమలో సాగిపోతున్నాము. కేవలం నమ్మికతోనే రక్షణ స్వీకరించాము. స్టీవ్ బ్రౌన్ అన్నారు దేవుని వాక్యాన్ని తర్కించుటకును వాదించుటకును కాదుగాని వాక్యాను సారంగా జీవించుటకు చదవాలి. మనం కోరే యేసు సహవాసం కంటె యేసు కోరేమన సహవాసం ఎంతో ఎక్కువని గ్రహించాము. దేవుని నడిపింపులో వెళితే తప్పటడుగు వేసే ప్రసక్తి లేదని నమ్మాను. విజయ సాధకులుగా ఉండాలని కాదు నమ్మకస్తులుగా ఉండాలనే దేవుని కోరిక అని తెలిసింది. గులాబి ముళ్ళ గురించి గోలపెట్టక ముళ్ళ మధ్యనున్న గులాబీలకై కృతజ్ఞత చూపడం నేర్చుకున్నాము. దేవునిపై జ్వాలలు రేగే హృదయం లేకుంటే యేసు కోసం నీవు ప్రకాశింపలేవు. జీవాహారమైన క్రీస్తే మన ఆత్మసంబంధమైన ఆకలిని తీర్చగలడు. యేసు మన హృదయాన్ని ఏలుతుంటే శాంతి ఏలుతుంది. దేవుని కోసం గడిపిన జీవితం లెక్కంతా నిత్యత్వములో గణనకు వస్తుంది. కేవలం, దేవుని గూర్చి వినడం వల్ల విశ్వాసంతో బాప్తిస్మం తీసికోగలిగాము గానీ బైబిలులోని వాగ్దానాలు సత్యాలు అంతగా తెలియని స్థితి. బైబిలు పఠనంవల్ల ఆ సత్యాలు పరిశుద్ధాత్ముని సహా యంతో అతి భక్తిశ్రద్ధలతో నేను నా భార్య నేర్చుకున్నాం. ఎవరూ బోధించలేదు.

స్థంబాలగురువు ఇశ్రాయేలుగారిని సంప్రదించి అనేక పుస్తకాలు, జీవిత చరిత్రలు చదివాము, ఎన్నో మాస పత్రికలు తెప్పించుకున్నాము. జీవాహారం, కాపరి మన్నా, మరనాత, యేసు పిలుచుచున్నాడు, పరవస్తుగారి జీవిత చరిత్ర, సాధు సుందర్‌సింగ్ గారి జీవితం, క్రీస్తు గలవారు - క్రీస్తులేనివారు, ప్రభుపాద సన్నిధి, ఆరార్కేమూర్తిగారి జీవితం, భక్తసింగ్ గారి జీవితం, తెర చినిగెను, దాగెడు

స్థలము యిలా ఎన్నో పుస్తకాలు, బైబిలు ఎడతెగక చదివేవారం. నా హృదయంలో రేగే ప్రశ్నలకు సరియైన జవాబు వాక్య రూపంలో ఉన్న క్రీస్తే. యేసు ప్రభువు ఎవరు? ఎందుకీ లోకానికి వచ్చారు? ఎందుకు శిలువ వేసారు? తన స్వకీయులే వ్యతిరేకించి తన జాతివారే హింసించారెందుకు? ఆయనే క్రీస్తు. నిజదేవుడు. మన పాపాలు క్షమించే దయామూర్తి ఆ దేవుని మరింత ప్రేమతో వెంబడించాము. స్వీయ రక్షకునిగా ధృడపర్చు కున్నాము.

ప్రార్థన చేసే విధం మా అబ్బాయి గిరి నేర్పించాడు. ఆ ప్రబోధంలో మేము మా అబ్బాయిని అనుకరించి ప్రార్థనలో పట్టుదల పెంచి క్రమంగా నమ్మకంగా మేము సేవిస్తున్న యేసును మిగిలిన కుమారులు, కోడళ్ళు, కుమార్తె సంతోషంతో స్వీకరించి కృపానిధి సంఘం సభ్యులై నేడు ఆధ్యాత్మిక ఎదుగుదలతో వర్థిల్లుట మాకు ప్రభువు ప్రసాదించిన అద్భుత దీవెన.

22 మంది కుటుంబ సభ్యులము ప్రతి రాత్రి కలిసి ఆరాధించే భాగ్యం దేవుడిచ్చారు. అబ్రాహాము జీవితంలో విశ్వాసం, మోషే జీవితంలో సాత్వీకం దేవుని వాగ్దానాలు, యెషయా సామెతలు, కీర్తనలు దినవృత్తాంతాలు, సువార్తలు పత్రికలు ఎక్కువ యిష్టం. ఎన్నో వాగ్ధానాలు స్వతంత్రించుకున్నాను. అది ప్రభువు ప్రేరణమాత్రమే. మా అబ్బాయి గిరి, గురి అంతా క్రీస్తుకు తిమోతివలె సాక్ష జీవితం జీవించడమే. 2 తిమోతి 2:15 దేవుని యెదుట యోగ్యునిగా సిగ్గు పడనక్కరలేని పనివానిగా సత్యవాక్యము సరిగా ఉపదేశించు వానిగా నిన్ను నీవే దేవునికి కన పరచుకొనుటకు జాగ్రత్తపడుము.

ఈ వాక్యం గిరి సార్థకముచేసాడు. స్టెతస్కోపులో గుండె చప్పుడు వినే డాక్టరు గారు గనుక ఆ ప్రతి లబ్ డబ్ చప్పుడు గూర్చి ఆయన సాక్షమిచ్చే సత్యము ఒక్కటే హృదయ మనెడి తలుపు వద్ద క్రీస్తు నిలిచి తలుపు తట్టిన శబ్దం ప్రతి వ్యక్తి వినాలి. ఎంత గొప్ప సత్యం! నాకైతే అబ్రాహాము విశ్వాసం నా విశ్వాసంనకు పునాది. హెబ్రీ 11:8 విశ్వాసమును బట్టి అనేమాట యిష్టం. నిన్ను నన్ను పిలిచాడు, పిలుస్తునే ఉన్నాడు. ఆయన ప్రేమను, శక్తిని విశ్వాసంతో ఆధారపడి అందుకోవాలి. అబ్రాహాముతో నేను నీకు చూపించే దేశం వెళ్ళాలన్నాడు, పేరు చెప్పలేదు.


ఆదికాండము 12:1, వినయ విధేయతలతో దేవుని మాటపై ఆధారపడడం నేర్చుకున్నాడు. నమ్మి ఆయన మాటపై ఆధారపడినప్పుడు నిత్యం తోడుగా ఉండి నిర్దోషముగా నిలువ బెట్టే శక్తిమంతుడు. తొట్రిల్లకుండా కాపాడే దేవుడు యూదా 25 వచనము. బలవంతుడగు దేవుడు శోధలను నుండి రక్షింప సమర్థుడు. మనమెంత బలహీనులమో దేవుడు అంతటి శక్తిగల బలవంతుడు. హెబ్రీ 11:9 అబ్రాహాము పునాదులు గల పట్టణమునకు ఎదురు చూచాడు నేను కూడా వాగ్దానములను నమ్మి, ఆ నిత్య నివాసంలో నాతో కూడా సదా నివసిస్తానని వాగ్దానమిచ్చిన ఆ యేసుకై ఆ రాజ్యానికై నిరీక్షణతో ఎదురు చూస్తున్నాను. నా వారిని హెచ్చరిస్తున్నాను. నాకిష్టమైన వాగ్దానాలు మనస్సులో ఎప్పుడూ ధ్యానిస్తాను. నాకు నచ్చినవి స్వతంత్రించుకున్న దేవుని వాక్యాలు. నేనే అన్న మాటలే.

1. నీ రాకపోకలయందు కాపాడువాడను నేనే. కీర్తనలు. 121:8
2. కంటిపాప వలె కాపాడువాడను నేనే. జెకర్యా 2:8
3. భయపడకుము నిన్ను విడిపించి రక్షించు వాడను నేనే యెషయా 43:1-3
4. వృద్ధాప్యంలో నిన్ను ఎత్తుకొనువాడను నేనే. యెషయా 43:1-3
5. నేను పై నుండి దిగివచ్చినవాడను. యోహాను 8:23
6.నేను లోకానికి వెలుగైయున్నాను యోహాను 8:12
7. నేను గొఱ్ఱెల ద్వారాన్ని యోహాను 10:7
8. నేను మంచి కాపరిని యోహాను 6:35
9. నేను జీవాహారాన్ని యోహాను 15:1

**(మిగతాది 23వపేజీలో)**

# బైబిల్ ప్రాముఖ్యత

ఎందుకంటే ఈ దేశ సహోదరుల ప్రయోజనార్థమై నేను పరిశుద్ధ గ్రంథమును వారి భాషలోనికి తర్జుమా చేయుచున్నాను. నన్ను పిచ్చివాడినిగా కొందరు భావించవచ్చు. అయితే నేనింత మంచి పనికి పూనుకొన్నందుకు నీకు సంతోషమే. ఇంకొక ఏడాదిలో నేను పూర్తి తర్జుమా ముగించగలను. అమ్మా! నేను తలపెట్టిన ఈ కార్యము నెరవేర్చ గలుగునట్లు ప్రార్థించు. ఈ లోకములో నాకు దీనిని మించినది వేరొకటి లేదు. ఈ కార్యమును తుదముట్టించుటలో నాకు ఏమి సంభవించినను నేను లెక్క చేయను" అంటూ ఒక ఉత్తరం వ్రాశాడు. ఈయన తన చిన్నతనం నుండి సువార్తను ప్రకటించుటలో చాలా ఆసక్తి చూపినందు వలన తన మేన మామ కూడా మెచ్చుకుంటు ఉండేవాడు. తన ఉద్యోగ నిమిత్తం ఇండియా వచ్చే సమయంలో "మహిమగల సువార్తను ఇండియా ప్రజలకిచ్చుటకే దేవుడు నిన్ను ఇండియా పంపుటకు నిర్ణయించెను" అని చెప్పేడంట. అయితే డాడ్సు వ్రాసిన ఆ ఉత్తరం తల్లికి చేరక మునుపే డాడ్సు చనిపోయాడు. అతడు చేసిన పని విలువ తెలియక తన తోటి ఉద్యోగులు ఆ వ్రాత ప్రతులను చిత్తు కాగితములు కట్టగా భావించి తగులబెట్టిరి. ఇలా ఇంకా ఎందరో బైబిల్ భాషాంతరమునకు ఎన్నో వ్యయ ప్రయాసలను అనుభవించిరి.



సిరంపూరు మిషనరీలైన విలియంకేరీ, మార్ష్ మాన్, వార్డులను సిరంపూరు త్రిమూర్తులు అంటారు. వారు 1805లో నూతన నిబంధన తర్జుమా మొదలుపెట్టి అంతా సిద్ధంగా ఉన్న సమయంలో 1812లో ముద్రణాలయముకు నిప్పు అంటుకొని వ్రాతప్రతులు, అచ్చులు, కాగితాలు అన్ని కాలిపోయాయి. తదుపరి ప్రయత్నంలో నూతన నిబంధన, పాత నిబంధనలోని పంచగ్రంథములను, తెలుగులోనికి అనువదించి ముద్రించిరి. లండను మిషనుకు చెందిన ఇద్దరు మిషనరీలు జార్జిక్రాన్, అగస్టీన్ డిగ్రాంట్లు విశాఖ పట్టణం చేరి తెలుగు అనువాదము మొదలుపెట్టిరి. ఈ పనిలో ఆసక్తి చూపి డిగ్రాంగ్ తన మిషనరీ మిత్రులకు ఉత్తరం వ్రాస్తూ –మిగిలిన పనులన్నింటి కంటే బైబిల్ భాషాంతరమునకే ప్రాధాన్యమియ్య వలెనని వ్రాసియున్నాడు. ఈ భాషాంతరం చేయు పనిలో ఆనంద రాయర్ సహాయం తీసుకొనెను. ఈయన బ్రాహ్మణుల నుండి క్రైస్తవు డాయెను. డిగ్రాంగు గ్రీకు భాషలో నుండి, ఆనందరాయర్ తమిళము నుండి నూతన నిబంధనను తర్జుమా చేసి వారిరువురు చేసిన పనిని సరిచూసుకొని తెలుగు ప్రతిని సిద్ధము చేశారు. డిగ్రాంగ్ ఈ పనిలో అనేక ప్రయాసలు పడుచు "తను మరణించు సమయంలో చివరి మాటలలో "భాషాంతరం చేయుటకే నేను బ్రతికి యుండనవసరం లేదు. నేను లేకపోయినప్పటికి ప్రభువు ఈ పనిని కొనసాగించును అని పలికెను". అలాగుననే ఆ పని ఆగలేదు. ఆనంద రాయర్, జాన్ గోర్డన్ అను మరియొక మిషనరీ కలసి తెలుగు నూతన నిబంధనను మద్రాసులో ముద్రించిరి. తరువాత కొన్ని పాతనిబంధన పుస్తకములు కూడా తెలుగులోనికి అచ్చు వేయబడినవి. 1844లో ఒక సభ ఏర్పాటు చేయ బడెను. అప్పటికి వాడుకలో ఉన్న భాషాంతరాలను సరిచేసి అందరికి ఆమోదంగా ఉండునట్లు ఒక కూర్పును సిద్ధము చేయుటకు నిర్ణయించి 1857 నాటికి ఒక పూర్తి తెలుగు బైబిలును సిద్ధము చేసిరి. 1857 లో మొదటిగా పూర్తి పాతనిబంధన తెలుగులో అచ్చువేయబడినది. (మిషనరీలే కాక మద్రాసులో సివిల్ సర్వీసులో ఉన్న సి.పి. బ్రౌన్ కూడా సొంతంగా బైబిల్ను తెలుగులోకి తర్జుమా చేశాడు. ఈ తెలుగు బైబిల్ ప్రతి ఇప్పటికి లండన్ బైబిల్

గృహములో ఉన్నదంటారు. ఈయన గొప్ప పండితుడు. ఆయన తయారు చేసిన తెలుగు-ఇంగ్లీషు, ఇంగ్లీషు-తెలుగు నిఘంటువులు ఇప్పటికి వాడుకలో ఉన్నవి). 1865లో మద్రాసు సహాయ సంఘం వారు ఒక కమిటీని నియమించి ఈ బైబిలును సవరించవలెనను ఉద్దేశ్యముతో జాన్‌గారి సహాయంతో 1884లో సరిచేయబడిన బైబిల్ ముద్రించ బడినది.

తర్వాత రెవ.డి. అనంతం, బి. సిన్నయ్య, ఇ. లూయిస్, జె.ఆర్. బేకన్ల సహాయముతో 1904 సం॥లో ఒకసారి, 1911 సం॥లో మరియొక సారి సవరించబడెను. మొత్తం మీద ఈ బైబిల్ భాషాంతరం అన్ని సంఘాల ఆమోదం పొందెను. ఆ తర్వాత సవరణలు ఏమి జరుగ లేదు. అయితే 1913-14 సం॥లలో ఏలూరు సమీపంలోని లక్కవరం జమిందారు రాజా భుజంగరావుగారు నూతన నిబంధనలోని సువార్తలు, రోమా, గలతీ పత్రికలను కావ్యరూపములో ప్రకటించెను. 1941 సం॥న రెవ. డబ్ల్యు, బాగ్స్‌గారిచే తెలుగు రెఫెరెన్సు బైబిల్ ప్రచురింపబడినది.

తెలుగు బైబిలు మొత్తం ఆదిమ, హెబ్రీ, గ్రీకు భాషల నుండి భాషాంతరం చేయబడినందున దోషరహితంగా నున్నది. కాని ఆంధ్రక్రైస్తవసభ వారు, అప్పటి హైదరాబాదు క్రైస్తవ సభవారు ఆలోచించి అన్ని సంఘములు ప్రతి నిధులను సమకూర్చి తెలుగు బైబిలును పూర్తిగా పునర్విమర్శ చేయనవసరము లేదు అని నిర్ణయించిరి.

మద్రాసు సహాయ సంఘము నాయకత్వమున సవరణ కమిటీ ఏర్పడి భాషాదోషములను దిద్ది కఠినమైన పదాలను సులభపరచి 1952 సం॥న అచ్చు వేయించిరి. అదియే ఇప్పుడు మనము వాడుచున్న బైబిలు.

1920-23 సం॥లో తెలుగు బైబిల్స్ చాలా కరువులో ఉండేవి. దినములలో తెలుగు బైబిలును ఆసక్తిగా ఎత్తి వ్రాసిన వారున్నారు. 1892లో ఒక్క సువార్తయైననూ తెలుగులో దొరకలేదట. 1852లో క్రొత్త నిబంధన ప్రతు లేవి మద్రాసులో లేవట. దేవుని మహా కృప వలన మనం కొనగలిగిన వెలలో మనకు బైబిల్స్ లభించుచున్నందుకు ఆయనకు మనం స్తుతులు చెల్లించాలి. దీని కొరకై అనేక వ్యయ ప్రయాసలు పడుచున్న సంస్థల కొరకై, సంఘముల కొరకై ప్రార్థించాలి. వాక్యమును భక్తితో చదివి ఆత్మీయ జీవితంలో మేలులు పొందాలి. ఈ వాక్యమునకు ఎవరెన్ని వ్యాఖ్యా నాలు వ్రాసినా, చదివేటప్పుడు దేవుడు నీతో నాతో మెల్లని స్వరముతో పలికే పలుకులను అర్థం చేసుకొని జీవితములకు అన్వయించుకోవాలి.

"వాక్యము చీకటిగల చోట వెలుగిచ్చు దీపమైన ట్టున్నది దానియందు మీరు లక్షముంచిన యెడల మీకు మేలు" 2పేతురు 1:9, "నీ వాక్యము నా పాదములకు దీపమును నా త్రోవకు వెలుగునై యున్నది" కీర్తన 119:105. ఈ పరిశుద్ధ వాక్యములు దేవుని వాక్యములు అని చెప్పడానికి ఏవైనా నిదర్శనములు ఉన్నవా?

ఈ 66 పుస్తకముల కలయిక అయిన బైబిల్ దాదాపు 40 మంది దేవుని భక్తులు దాదాపు మూడు భాషలలో, దాదాపు 1600 సం॥ల మధ్య కాలంలో వ్రాయబడిన దీనిలో ఉన్న ఒకే ఒక్క ఉద్దేశ్యం "క్రీస్తు ద్వారా సర్వ మానవాళికి రక్షణ".

"ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛనుబట్టి కలుగదు గాని మనుష్యులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింప బడినవారై దేవుని మూలముగా పలికిరి" 2పేతురు 1:21. ఈ విధంగా పలికిన మాటలు తర్వాత కాలములో మట్టి పలకల మీద, జంతు చర్మముల మీద వ్రాయబడి భద్రపరచ బడినవి. ఇవి బబులోను ప్రాంతములలో కనుగొనబడినవి. ఈ వ్రాతప్రతుల చుట్టలో ఒక బైబిల్ పుస్తకములోని కొంత భాగము మాత్రమే సరిపోతుంది. అంటే కొన్ని వందల వ్రాత ప్రతులు భద్రపరచబడినాయన్న మాట. ఈ వ్రాత ప్రతులు భద్రపరచబడి, వాటిని తిరిగి కాపీ చేయడంలోను కూడా దేవుడు తన వాక్యమును మన కొరకు భద్రపరి చాడని చెప్పగలం. "యెహోవా సెలవిచ్చునదేమనగా", "సైన్యములకు అధిపతియగు యెహోవా సెలవిచ్చున దేమనగా", "ఇదే యెహోవా వాక్కు", "యెహోవా యొద్ద నుండి వచ్చిన సమాచారము" ఈ విధంగా పాత నిబంధనలో అనేక మార్లు వ్రాయబడియుంది.

**(సశేషం)**

# మదర్ తెరీసా

మరియు మదర్ జనరల్ నుండి నీవు కాన్వెంట్ నుండి బయటకు వెళ్ళుటకు పర్మిషన్ ఇవ్వాలి అని చెప్పారు. ఆ విధంగా ఆర్చ్ బిషప్‌గారు మదర్ తెరీసాకు తన నిస్సహాయ తను తెలియజేశారు. అప్పుడు మదర్ తెరీసా తన రెండవ పిలుపును దేవుని చేతుల్లో వుంచి ముందుకు సాగింది. ప్రభువు ప్రణాళికలో వుంటే ఎలాగైనా జరుగుతుంది. కనుక తను మొదలు పెట్టే మిషనరీ యొక్క కాన్‌స్టిట్యూషన్ వ్రాయుట మొదలుపెట్టింది. మదర్ తెరీసా బయటకు వెళితే తనతో పదిమంది సిస్టర్స్ తనతో పని చేస్తామని స్వతహాగా ఒప్పుకుని మనస్ఫూర్తిగా రావాలి. అది ఒక సంవత్సర వ్యవధిలోనే జరగాలి. 1947 సంవత్సరమంతా ఎదురు చూసింది. ఆ సంవత్సరములోనే ఆగష్టులో ఇండియా రెండు ముక్కలై పాకిస్తాన్, భారతదేశాలుగా స్వాతంత్ర్యం పొందాయి. పాకిస్తాన్‌లోని హిందువులను ముస్లీం మతంలోకి మారాలని, భారత్‌లోని ముస్లీంలను హిందూమతంలోకి రావాలని గొడవలు జరుగుతున్నాయి. ఒరికనొకరు చంపుకుంటు న్నారు. ఎక్కడ చూసినా ప్రజలు సురక్షితమైన ప్రదేశాలకు పరుగెడుతున్నారు. అప్పటి పరిస్థితి పిచ్చెక్కిన వారి ప్రవ ర్తనలా అనిపించింది. 1947 సెప్టెంబరు ఒకటిన గాంధీ గారు కలకత్తాలో ఆమరణ నిరాహార దీక్ష పుచ్చుకున్నారు. 78 సంవత్సరాల వయసులో ఆయన తీసుకున్న నిర్ణయానికి బాధపడిన ఎందరో కరుడుగట్టిన నాయకులు ఆయన చెంత జేరి శాంతిని నెలకొల్పుతామని వాగ్దానము చేశారు. ఆ విధంగా కలకత్తాలో అల్లరి తగ్గిందిగాని అనేక ప్రదేశాల్లో అదే పరిస్థితి నెలకొంది. జనవరి 30, 1948న గాంధీగారి హత్య జరిగింది. అదే సంవత్సరము ఆగష్టులో దేవుని కృప మదర్ తెరీసాపై ప్రసరించింది. దేవునికి వందనములు చెల్లించింది. చిట్టచివరకు మదర్ తెరీసాకు తన సొంత మిషనరీస్ ఆఫ్ ఛారిటీని మొదలుపెట్టుకొనవచ్చు అనే పర్మిషన్ రోమ్ నుండి వచ్చింది. దేవునికి వందనములు చెల్లించింది. మొదటగా తాను రోగులకు చికిత్స చేయు విధానాన్ని నేర్చుకొనుటకు పాట్నాలో వున్న సిస్టర్స్‌కు ఉత్తరం వ్రాసింది. వెంటనే వారి దగ్గర నుండి జవాబు వచ్చింది. రోగులను శుభ్రపరచుట, వారి గాయాల్ని కడిగి కట్లు కట్టుట, వారికి ఇంజక్షన్లు ఇచ్చుట మొదలగు అనేక విషయాలు నేర్చుకుంది. తాను స్థాపించే సంస్థలో సిస్టర్స్ ఉప్పు, అన్నముతోనే సరిపుచ్చుకొని అతి సాధారణ జీవితము గడుపుతారని అచ్చటి డాక్టర్‌తో అన్నప్పుడు, మదర్ తెరీసాకు మంచి సలహా ఇవ్వబడింది. ఉప్పు అన్నంతో వారి శరీరము కూడా రోగగ్రస్తమై రోగులకు సేవ చేయుట కాకుండా వారు కూడా భారమయ్యే పరిస్థితి వస్తుందని చెప్పారు. అప్పుడు మదర్ తెరీసా తన అభిప్రాయాన్ని మార్చుకుని మన శరీరము దేవునికి ఆలయమై వున్నదని గ్రహించారు. మనము ఆరోగ్యంగా వుండి చుట్టూ వున్న వారికి ఆరోగ్యం ప్రసాదించి సేవచేయవలెనని నిశ్చయించు కున్నది. తనతో వుండబోయే సిస్టర్స్‌కి మంచి క్రమశిక్షణ, బేలేన్స్‌డ్ డైట్, అచంచలమైన సేవా దృక్పధం నేర్పించి ఆ సేవ ద్వారా యేసుప్రభువు ప్రేమ ప్రపంచ నలుదిక్కుల వ్యాపించాలని కోరుకుంది. తన కోరికలో స్వార్థం లేదు. ఎల్లప్పుడూ యేసుప్రభువే ఆమె హృదయంలో వుండి ఎలాంటి పరిస్థితినైనా చక్కబెట్టి ముందుకు తీసుకెళ తారనే నిర్భయం. ప్రతిరోజు ఆమె ప్రార్థనలు దేవునికి చేరి తను చేయవలసిన పనులకు జవాబు లభించింది.

పాట్నా నుండి తిరిగి కలకత్తాకు చేరుకుంది. డిసెంబరు 8, 1948న తాను ఒంటరిగా కలకత్తా వీధులలో సేవ ఆరంభించిన గొప్పదినము. అప్పటికే ఆమె 20 సం॥లు ఇండియాలో సేవ చేసింది. ఆమె స్కూలులో పని చేస్తున్న ప్పుడు తను ప్రపంచంలో అందరికంటే సంతోషమైన వ్యక్తిగా అనుకునేది. కాని ఈనాటి ఈ సేవలో తన సంతోషము ఎన్నో రెట్లు పెరిగింది. రెండు వారాల తరువాత ఆమె ఎక్కడ నుండి ఏమి మొదలుపెట్టాలో నిర్ణయించుకుంది. మోవిజిల్

అనే ముస్లీం మురికివాడలో తన పిలుపులోని సేవను ప్రారంభించాలని నిర్ణయించుకుంది. తన వద్ద వున్న కొన్ని రూపాయలతో ఒక రూమును అద్దెకు తీసుకుంది. ఆ తరువాత తన దగ్గర డబ్బులేదు. కాని దేవుడు ఇస్తాడు. తన భారమంతా దేవునిపైనే. ఆమె పిలుపులోని ప్రారంభాన్ని గమనిస్తే ఎంత చిన్నగా మొదలైందో చూశారా. ఎంతోమంది పేద ప్రజలు ఆమెను వింతగాను, అనుమానంతోను చూశారు. ఎందుకంటే ఒక యూరోపియన్ మహిళ ఆ విధంగా సేవ చేయుటకు ఎందుకు వస్తుంది అని కొందరైతే ఆమెపై రాళ్ళు వేశారు.

21, డిసెంబరు 1948న మోతీజిల్ ప్రాంతంలోని మురికివాడలో తిరుగుతున్న అయిదుగురు పిల్లల్ని పోగుచేసి వారికి చదువు చెప్పాలని మొదలుపెట్టింది. ఆ బస్తీలోనే ఒక చెట్టుకింద కూర్చోబెట్టి నేలపై మట్టిలో బెంగాలీ అక్షరాల్ని వ్రాసి పిల్లల వ్రేలితో దిద్దించటం మొదలుపెట్టింది. ఆ పిల్లలకు మదర్ తెరీసా వద్ద వున్న ప్రేమను కనుగొని ప్రతి రోజు ఆమె కొరకై ఎదురు చూడటం మొదలుపెట్టారు. ఆమె చెప్పిన మొట్టమొదటి పాఠము ఏమంటే వారికి శుభ్రంగా వుండటం నేర్పించింది. తన స్వహస్తాలతో వాళ్లకు స్నానం చేయించి ఉతికిన బట్టలు వేసింది. ఇక జబ్బులు వారి దగ్గరకు రావు అనే విధంగా వాళ్ళను శుభ్రానికి అలవాటు చేసింది. అది చూసిన అక్కడి ప్రజలు ఆమెకు సహాయం చేయటం మొదలు పెట్టారు. ఒకతను ఒక బల్ల తెచ్చి పెట్టాడు. మరొకతను ఒక కుర్చీ తెచ్చిపెట్టాడు. కొందరు ఆమెకు భోజనం పెట్టారు. ఒక వర్తకుని దగ్గరకు వెళ్ళి కొన్ని సబ్బులు దానంగా ఇవ్వాలని అడిగింది. పిల్లలకు పోషక ఆహారం ఇవ్వాలని భిక్షమెత్తింది. కొందరి సహాయంతో ప్రతిరోజూ మధ్యాహ్నం పిల్లలకు పాలు ఇవ్వటం మొదలు పెట్టింది. అనతికాలంలోనే 35మంది పిల్లలు తన స్కూలులో చేరారంటే ఎంత ఆశ్చర్యం. ఒక పారిస్ ప్రీస్ట్ ఫాదర్ వంద రూపాయలు దానం చేశారు. ఆశ్చర్య రీతిగా ఆమె రెండవ స్కూలు మొదలుపెట్టింది. అది విల్‌జాల బస్తీలో 20 మంది పిల్లలతో మొదలైంది. వాళ్ళంతా అక్షరాలు నేర్చుకుని చదువుకుంటున్నారు. ఎందరో స్వచ్ఛందంగా ఆమె సేవలో పాలి భాగస్తులైనారు. కొందరు పెద్దపిల్లలు వచ్చి పిల్లలకు అక్షరాలు నేర్పించేవారు. ఆ విధంగా రెండు స్కూళ్ళలో పిల్లలు ఏభై చొప్పున పెరిగారు. ప్రతిరోజూ పిల్లలు పరిశుభ్రంగా వస్తుంటే మదర్ చూసి ఎంతో సంతోషించేది. ఆ పిల్లలు బూతు మాటలు మాని వేశారు. క్రమశిక్షణతో పెద్దల్ని గౌర వించటం మొదలుపెట్టారు.

భిక్షమెత్తుకొని వచ్చిన డబ్బుతో ఆమె సేవ కొన సాగుతూ వుండగా ఒక ఫాదర్ ఆమెను తీవ్రంగా అవమా నించారు. భిక్షమెత్తుటకు తన వద్దకు రావద్దని, భిక్షగాళ్ళంటే తనకు అసహ్యమని ఆయన తీవ్రంగా మాట్లాడారు. అదే సమయంలో మదర్ తెరీసా ఇన్స్‌పెక్టర్ ఆఫ్ స్కూల్స్ దగ్గరకు వెళ్లి తనకు గవర్నమెంటు నుండి సహాయం చేయాలని అభ్యర్థించింది. భిక్షమెత్తుకోవడం చాలా కష్టమేగాని దాహము గొనిన యేసుప్రభువు కొరకు ఎంత కష్టమైనా చేయడానికి ఎల్లప్పుడూ సిద్ధమే అని మదర్ తెరిసా వుండేది.

26 ఆగష్టు 2008 మదర్ తెరీసా 98వ జన్మదినము. యేసుప్రభువు ప్రేమను లోకానికి చాటిన మదర్‌తెరీసా జన్మదినాన్ని జ్ఞాపకం చేసుకొనుట మనందరికి మేలుకరము. 'నేను దప్పిగొనియున్నాను' అని యేసుప్రభువు సిలువపై పలికిన ఐదవ మాట మదర్ తెరీసాకు ఎంతో ఇష్టమైన మాట. సిలువ మీద మరణించే సమయంలో యేసుప్రభువు ఏడు మాటలు పలికారు. గుడ్‌ఫ్రైడేనాడు ప్రపంచంలో వున్న క్రైస్తవ సంఘాలన్నీ ఈ ఏడుమాటల మీద ధ్యానం చేస్తూ, ఆ సిలువ వెలుగులో తమ జీవితాలను పరీక్షించుకుంటాయి. ఆనాడు క్రైస్తవులంతా దేవాయాలకు వెళ్ళి ఆ మాటల్లో నిబిడీకృతమైన పరమార్థాన్ని పరిగ్రహించి దాన్ని తమ జీవితాలకు సమన్వయం చేసు కోవాలని ధ్యానం చేస్తారు. పాపములో జీవించుచున్న జనులను, ప్రయాసలో జీవించు చున్న వారిని పాపము యొక్క శక్తి నుండి విడిపించాలని పాపికి బదులుగా సిలువలో నరకయాతన పడుచు పాపకూపములో పడియున్న వారిని విమోచించుటకు దాహముగొనెను.

**(సశేషం)**

6

# తల్లిదండ్రులారా!

మీ బిడ్డలకు దేవునియందలి భయభక్తులు నేర్పించడం ఎంత అవసరమో, డబ్బుకి దూరంగా ఉంచడం కూడా అంతే అవసరము. ఎందుకంటే, దేవుడు తనకు ప్రత్యామ్నాయంగా డబ్బుని ఉదహరించాడు. *"మీరు దేవునికిని సిరికిని దాసులుగా నుండనేరరు"* అని మత్తయి 6:24లో యేసు ప్రభువు చెప్పాడు. యేసుప్రభువే చెప్పాడంటే, ఎవరు ఎన్ని వక్రభాష్యాలు చెప్పినా దానికి తిరుగులేదు. చాలా ధనవంతులైన క్రైస్తవులు, క్రమం తప్పకుండా చర్చికి వెళ్తారు, దేవుని పేరట దానధర్మాలు చేస్తారు, వారి పిల్లలకు బైబిలులోని పేర్లు పెడతారు, మేమే నిజమైన క్రైస్తవులు అన్నట్లు జీవిస్తారు. కానీ, దేవుడా? ధనమా? అన్నది ఎంచుకోవాల్సి వచ్చినప్పుడు దేవున్నే వదిలేస్తారు. ఇందుకు ఉదాహరణగా ఒక ధనవంతుడైన యౌవనస్తుడి గురించి బైబిల్లో వ్రాయబడి వుంది. అతడు చిన్నప్పటి నుండి దేవునియందు భయభక్తులు కలిగియున్నాడని అతనే చెప్పాడు (మార్కు 10:20). బాల్యము నుండి పదిఆజ్ఞలు పాటిస్తూ, దేవునియందు భయభక్తులు కలిగియున్న వానికి 'నిత్యజీవమునకు వారసుడనవుతానా? లేదా?' అన్న అనుమానం ఎందుకు వచ్చింది? ఆ అనుమానం అతనిని పట్టి పీడిస్తున్నందువల్ల అతను పరుగెత్తుకుంటూ యేసు దగ్గరకు వచ్చి *"సద్బోధకుడా, నిత్యజీవమునకు వారసుడనగుటకు నేనేమి చేయుదును"* అని అడిగాడు (మార్కు 10:17). అంటే, అతను బాల్యం నుండి పాటిస్తున్న 'పదిఆజ్ఞలు' అతనికి మనశ్శాంతిని ఇవ్వలేదు. అందుకు కారణం, అతని **'ధనము'**. అందుకే యేసు అతనితో, నీ ధనమును వదిలిపెట్టి నన్ను వెంబడించు అని చెప్పినప్పుడు గానీ, అతని బండారం బయటపడలేదు. అతను మిగుల ధనవంతుడైనందున, ధనము మీదనే ఆధారపడి జీవిస్తున్నందున, ధనమును వదలడం ఇష్టంలేక, వ్యసనపడుతూ, దుఃఖపడుతూ వెళ్ళిపోయాడు. ఎంతో ఆశతో పరుగెత్తుతూ వచ్చిన అతను, ధనము విషయంలో వ్యసనపడుతూ వెళ్ళిపోయాడు. యేసుప్రభువు చెప్పినట్లు దేవునిని, ధనమును ఏకకాలంలో ప్రేమించడం అసాధ్యం. కాబట్టి మీ బిడ్డలు దేవునియందలి భయభక్తులతో పెరగాలంటే సాధ్యమైనంత వరకు ధనమునకు దూరముగా ఉంచండి. అంటే వారు పిల్లలుగా ఉన్నప్పుడు ఏ అవసరమైనా వారికి డబ్బులు ఇచ్చి కొనుక్కోమని చెప్పకుండా, మీరే వారికి అవసరమైనవన్నీ సమకూర్చండి. కనీసం స్కూల్లో చాక్లెట్స్ కొనుక్కోడానికి కూడా డబ్బులు ఇవ్వకుండా, మీరే వారికి కొని ఇవ్వండి. తోటి పిల్లలందరూ చాక్లెట్స్, బిస్కెట్స్ కొనుక్కుంటుంటే మా బిడ్డలు చూస్తూ ఉండాలా? అని మీకు అనిపించవచ్చు. అయినా సరే, ఈ విషయంలో మీ గుండె రాయి చేసుకోవడం మంచిది. డబ్బు అలవాటు చేయడం ద్వారా, డబ్బులు ఇవ్వనిదే స్కూలు వెళ్ళమని మారాం చేసే పిల్లలుగా తయారవుతారు. ఇలా చేయడం తల్లిదండ్రులకు కష్టమనిపించినా, మంచి ఫలితం పొందాలంటే మీ బిడ్డలకు డబ్బు అలవాటు చేయకండి. అలా అడిగినంత డబ్బు ఇచ్చి, వారికి అవసరం లేని వాటిని కొనుక్కోనే వరకు తీసుకు రాకండి. అలా డబ్బుకు అలవాటు పడిన పిల్లలు చాలా త్వరగా చెడు వ్యసనాలకు బానిసలవుతారు. తరచుగా డబ్బులు ఇవ్వకుండా, దేవున్ని ప్రార్థించమని చెప్పడం వలన దేవుడు వారి అవసరాలు తీరుస్తాడు అన్న భావన వారికి ఏర్పడుతుంది. వారి అవసరాలకు దేవుని మీద ఆధారపడటం నేర్పించండి. ప్రతి విషయానికి **'దేవుడు'** అన్న భావన వారు పిల్లలుగా ఉన్నప్పుడే కలుగజేయండి. **ఇది దేవుని చిత్తమై యున్నది.**

మీ బిడ్డలకు **'దేవుని మీద ఆధారపడటం'** నేర్పించడం ద్వారా వారు దేవునియందలి భయభక్తులు కలిగి, విశ్వాసంలో ఎదుగుతారు. షద్రకు, మేషాకు, అబేద్నెగో, దానియేలువలె దేవుని కోసం ఏం చేయడానికైనా సిద్ధపడతారు. వారు మానసికంగా తమ ప్రాణాలను దేవుని కోసం త్యాగం చేసి, భౌతికంగా తిరిగి పొందారు. అలాగే మీ బిడ్డలు కూడా నిజక్రైస్తవులుగా జీవిస్తారు. దేవుని సంరక్షణలో సురక్షితంగా

ఉంటారు. మీ బిడ్డలను మీరు ప్రాణానికి ప్రాణంగా ప్రేమించి, వారికోసం ఏవైతే సమకూరుస్తారో, అంటే ఉన్నత చదువులు, ఆస్తిపాస్తులు, అవేవీ మీ బిడ్డలకు సంతోషాన్ని, సమాధానాన్ని ఇవ్వలేవు. కేవలం దేవుడు మాత్రమే సంతోషాన్ని, క్షేమాన్ని ఇవ్వగలడు. *"స్త్రీ తన గర్భమున పుట్టిన బిడ్డను కరుణింపకుండ తన చంటిపిల్లను మరచునా? వారైన మరచుదురు గాని నేను నిన్ను మరువను. చూడుము నా యరచేతులమీదనే నిన్ను చెక్కియున్నాను" (యెషయా 49:15,16)* అని చెప్పిన దేవుని సంరక్షణలో, కాపుదలలో ఉండటం మీ బిడ్డలకు ఎంతో క్షేమకరము. బిడ్డల క్షేమము కోరుకోని తల్లిదండ్రులు ఎవరూ ఉండరు. అయితే తల్లిదండ్రులు ఎంతసేపటికి ఈ లోకానుసారమైన క్షేమము గురించే ఆలోచిస్తుంటారు. *"భూమి మీద మీ కొరకు ధనము కూర్చుకొనకుడి" (మత్తయి 6:19)* అని యేసుప్రభువు చెప్పినా, 'మా బిడ్డలు భవిష్యత్తులో ఎలాంటి కష్టాలు పడకూడదని' మీరే మీ బిడ్డల కొరకు ధనము సమకూరుస్తుంటారు. **'ధనము కూర్చు కొనకుడి'** అని యేసుప్రభువు చెప్పిన మాటలు ఎవరూ అంగీకరించ లేరు. ఎందుకంటే, డబ్బు లేనిదే మనుష్యులు బ్రతకలేరు అన్నది మనుష్యుల నరనరాల్లో జీర్ణించుకు పోయింది. అందుకే యేసుప్రభువు చెప్పినట్లు చేయడానికి విశ్వాసులే కాదు, వారిని దేవునిలో నడిపించాల్సిన పాస్టర్లు కూడా ఇష్టపడరు. **'మరెలా బ్రతకాలి?'** అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. *"కాగా దేవుడు తన ఐశ్వర్యము చొప్పున క్రీస్తుయేసు నందు మహిమలో మీ ప్రతి అవసరమును తీర్చును" (ఫిలిప్పీ. 4:19)* అని మనం చదివే బైబిల్లోనే ఉంది. ఈ వాక్యాన్ని హృదయపూర్వకంగా నమ్మే వారెవరైనా దేవుని మీదనే ఆధారపడతారు. నమ్మనివాళ్ళు అష్టకష్టాలు పడతారు. అయినా ఇలాంటి వాక్యాలు మన చిన్ని బుర్రకి ఎక్కవు. మన ప్రతి రక్తపు బొట్టులో కూడా డబ్బు సెల్స్ ఎక్కువగా ఉంటాయి. తల్లిదండ్రులే ప్రతి క్షణం **'డబ్బు, డబ్బు'** అంటుంటే, పిల్లలెలా **'దేవుడు, దేవుడు'** అంటారు. అందుకే వారు కూడా మీరు నడిచిన బాటలోనే నడుస్తారు. మీలాగే ఎన్నో కష్టాలు, బాధలు అనుభవిస్తారు. ఈ భూమి మీద మనం జీవించినంతకాలం దేవుని మీద ఆధారపడి సంతోషంగా జీవించాలని దేవుడు కోరుకుంటాడు. కానీ, సాతాను మాత్రం 'మీరు దేవుని మీద ఆధారపడితే, సుఖ భోగాలు అనుభవించలేరు, మీ దగ్గర ఎంత డబ్బు ఉంటే, మీ లైఫ్‌ని అంతగా ఎంజాయ్ చేయొచ్చు' అని, హవ్వను మోసం చేసినట్లే అందరిని మోసం చేస్తుంది. అప్పుడు ఈ లోకభోగాలు చూపునకు అందంగా కనబడి సాతాను వెంబడి వెళ్ళిపోతారు. పోతే పోయారు, అమాయకులైన మీ పిల్లలను మీతో కూడా సాతాను వెంట తీసుకెళ్తారు. కాబట్టి తల్లిదండ్రులారా, క్రైస్తవులైన మీరు అన్యజనులవలె కాక ధనాపేక్ష లేనివారై, మీ బిడ్డలను డబ్బుకు దూరంగా ఉంచుతూ వారిని **'దేవుని బిడ్డలుగా'** పెంచండి. అప్పుడు మాత్రమే మీరు మీ పిల్లలపట్ల **'నిజమైన ప్రేమను'** చూపించిన వారవుతారు. **దేవుని చిత్తప్రకారము జీవించండి.** **(సశేషం)**


# ఇంటర్నెట్‌లో తెలుగు బైబిల్

**మీరు ఎక్కడున్నా సరే, మీ స్మార్ట్ ఫోన్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్‌లలో తెలుగు బైబిల్ చూడవచ్చును. అంతేకాక తెలుగు-ఇంగ్లీషు ప్యారలల్ బైబిల్, తెలుగు ఆడియో బైబిల్, తెలుగు బైబిల్ ఎన్‌సైక్లోపీడియా, తెలుగు ఆడియో, వీడియో పాటలు, తెలుగు పాటల రచనలు, అద్భుత సాక్ష్యములు, బైబిల్ వాల్‌పేపర్స్, తెలుగు క్రైస్తవ పుస్తకములు ఇంకా మరెన్నో మీ కోసం... నేడే దర్శించండి...**

**www.onlinetelugubible.net**

# క్రీస్తును నేర్చుకొనుట, జీవించుట

'హన్నాకృప' పాఠకులకు, మన ప్రభువైన యేసుక్రీస్తు నామమున మీకందరికి నా శుభములు.

"యేసు జ్ఞానమందును, వయస్సునందును, దేవుని దయ యందును, మనుష్యులు దయయందును వర్ధిల్లుచుండెను (వ్యా2:62). ఒక కుటుంబంలో శిశువు జన్మించుట మిక్కిలి ఆనందదాయకం. కాని ఆ బిడ్డ ప్రతి దినము ఎదుగుచున్న కొలది కుటుంబ సభ్యులకు మరి ఎక్కువ ఆనందం. బిడ్డలు జన్మించినంత మాత్రాన తల్లితండ్రులు తృప్తి చెందరు. వారి వయస్సునుబట్టి ఎదుగుచున్నప్పుడు మాత్రమే ఎక్కువ సంతోషిస్తారు. ఇక్కడ యేసు ప్రభువు ఎలా ఎదిగాడో దేవుని వాక్యం తెలియజేస్తుంది. జ్ఞాన వివేకములుగ ల ఆత్మ ఆయన మీద ఉండినది. ఆయన జ్ఞానమందు వర్ధిలుచుండెను అని చెప్పబడింది. మనకు కూడ ఈ కృప కావాలి. దేవుని జ్ఞానమందును క్రీస్తును గూర్చిన వివేకమందును ఎదుగ వలెను. 'మీరు క్రీస్తును నేర్చుకొన్నవారుకారు' అని వ్రాయ బడియున్నది (ఎఫెసీ 4:20) క్రీస్తుకు మన హృదయాల నిచ్చిన తర్వాత, మనము ఆయనను నేర్చుకోవాలి. అదే మన జీవిత లక్ష్యమై యుండాలి. పౌలు కూడా అదే చెపుతున్నాడు. "నా మట్టుకైతే బ్రతుకుట క్రీస్తే, చావైతే లాభము" (ఫిలిప్పీ.1:21). ఆయన క్రీస్తును జీవించాలని కోరాడు. క్రీస్తువలె జీవించుట మీద తన హృదయాన్ని నిలిపాడు. ఎప్పుడైతే ఆయన యేసుక్రీస్తును తెలిసికొని, యేసుక్రీస్తును జీవించాలని కోరాడో, అప్పుడు యేసుప్రభువు ఆయత జీవించుట మొదలుపెట్టారు. క్రీస్తే నాయందు జీవంచుచున్నాడని ఆయన చెప్పాడు. దేవుని రాజ్యము కొరకు, ఆత్మీయ అభివృద్ధి కొరకు, మనమేది ఆశించినను అది దేవుడు మనకు దయచేయును. పౌలు మారుమనస్సు పొందిన తర్వాత ఆయన దేవుని జ్ఞానమును ఎక్కువ పరిమాణ ములు పొందాడు. క్రీస్తే దేవుని జ్ఞానమని గ్రహించాడు. యేసు క్రీస్తే దేవుని జ్ఞానమని ఎరిగి, ఆయన యేసుక్రీస్తును కోరుకున్నాడు. జ్ఞానములో ఆయన అభివృద్ధి చెందాడు. మనము క్రీస్తును నేర్చుకోవాలి. శరీరంలో వయస్సు బలము ఉన్నప్పుడే దేవున్ని నేర్చుకోవాలి. అది మన నిజమైన జీవితం. ఆయన పాదాల దగ్గర కూర్చొని మనము దేవుని వాక్యము నేర్చుకొంటే, మనము క్రీస్తువలె అవుతాము. మన జీవితములో మనకు సరమైన ఆత్మీయ గురి ఉండాలి. మనము క్రీస్తువలె మారాలని కోరితే, మనము కూడా ఆ గురిని వెదకాలి. అనేకులు మారుమనస్సు పొందిన తర్వాత వేర్వేరు విషయాలను ఆశిస్తారు. మొదటిలో మన క్రొత్త జీవితములో ఏమి కోరుకోవాలో మనకు తెలియదు కాని దేవుని ఆత్మ మనము క్రీస్తువంటి జీవితమును కోరుకోవాలని అర్థము చేసుకోవడానికి సహాయం చేస్తాడు. దేవుని పద్ధతిలో ఆయన ప్రణాళిక అంతా మనకు బయలుపరుస్తాడు. మనము క్రీస్తును నేర్చుకోవాలి, క్రీస్తులో జీవించాలి, క్రీస్తును మహిమపరచాలి . మనము మారుమనస్సు పొందిన తర్వాత. క్రీస్తును నేర్చుకొన వలసినంతగా నేర్చులోలేదు. దేవుడు మనలో ఆశించినంత జ్ఞానమును మనము పొందలేదు. కాని దేవుని జ్ఞానమునందు మనము అభివృద్ధి చెందాలనేది ఆయన కోరిక. మనము దేవుని వాక్యమునకు విధేయత చూపుట అభ్యాసము చేసిన కొలది మనము క్రీస్తువలె జీవించగలము. క్రీస్తును ఇంకా ఎక్కువగా తెలుసుకోవాలని. క్రీస్తువలె ఉండాలని, క్రీస్తువలె జీవించాలని, క్రీస్తును మహిమ పంచాలనే నూతన లక్ష్యాలు మన జీవితములో ఉండాలి. అలాంటి కోరికలు మన జీవితంలో నేరవేరునట్లు దేవుడు మనందరికి సహాయం చేయును గాక! –ఇట్లు **డా॥ సుష్మ ప్రశాంత్, నెల్లూరు**

స్త్రీల విభాగం

# నా కుటుంబము



**భార్య, భర్త, పిల్లలు కలిసి ఒకే చోట ఉంటే దానిని కుటుంబము అంటారు. పిల్లలు ఉన్నా లేకపోయినా భార్యా భర్తలు కలిసి జీవిస్తున్నా కుటుంబమనే అంటారు. కుటుంబ వ్యవస్థ అనేది దేవుని ప్రణాళికలో భాగమే. కుటుంబ వ్యవస్థలో స్త్రీ ప్రధాన భూమిక పోషిస్తుంది.**

---

దేవుడు తన ప్రజలకు ధర్మశాస్త్రాన్ని మోషే ద్వారా అనుగ్రహించినప్పుడు మొదటిగా పది ఆజ్ఞలను ఇచ్చాడు. వీటిలో నాలుగు దేవునికి మానవునికి సంబంధించినవి. ఆరు మానవులకు, తోటి మానవులకు సంబంధించినవి.

పది ఆజ్ఞలను రెండుగా చేశాడు. 1) నీ దేవుడైన ప్రభువును నీ పూర్ణ హృదయముతోను, నీ పూర్ణ మనస్సు తోను, నీ పూర్ణ శక్తితోను, నీ పూర్ణ వివేకముతోను ప్రేమింప వలెను. 2) నిన్నువలె నీ పొరుగు వాని ప్రేమింపవలెను.

మరలా ఇందులో మొదటిది కుటుంబ వ్యవస్థకు సంబంధించినది. నీ దేవుడైన యెహోవా నీకనుగ్రహించు దేశములో నీవు దీర్ఘాయుష్మంతుడవగునట్లు నీ తల్లిని నీ తండ్రిని సన్మానించుము అని నిర్గమకాండంలో ఉంటే, లేవీయకాండం వచ్చేటప్పటికి ఇరవైయ్యవ అధ్యాయం అయిదవ వచనంలో తండ్రి చేసిన పాపమునకు నేను వానికిని వాని కుటుంబమునకు విరోధినవుతాను అన్నాడు. ఎనిమిదవ వచనములో 'మీరు నా కట్టడలను అనుసరించి వాటిని అనుసరింప వలెను. నేను మిమ్మును పరిశుద్ధపరచు యెహోవాను' అని అన్నాడు.

ఎవడు తన తల్లినైనను తండ్రినైనను దూషించునో వానికి మరణ శిక్ష విధింపవలెను. వాడు తన తండ్రినో తల్లినో దూషించెను గనుక తన శిక్షకు తానే కారకుడు. తల్లిదండ్రుల విషయములో బిడ్డలకు ఎంత నిర్దిష్ఠమైన ఆజ్ఞ ఇవ్వబడిందో గమనించండి. తల్లిదండ్రులు మంచివారా? చెడ్డవారా? అని కాదు. ఇది మనల్ని భయపెట్టటానికి వ్రాయబడింది కాదు. ఇందులో పాతనిబంధన కాలము, క్రొత్త నిబంధన కాలము అని లేదు. బైబిలు అన్నితరములకు ఒక్కటే. ఏ ఇంట్లో పిల్లలు తల్లిదండ్రులను సన్మానిస్తారో ఆ ఇంట్లో దేవుని దీవెన నిలచి ఉంటుంది. నాకు తెలిసినంత వరకు, నేను గమనించినంత వరకు తల్లిదండ్రులను గౌరవించిన (తల్లి, తండ్రి మంచివారు కాకపోయినా, మర్యాదస్తులు కాకపోయినా, తండ్రి త్రాగుబోతు అయినా, తల్లి తిట్టుబోతు అయినా బిడ్డలు చదువులోను, ఆరోగ్యము లోను ఆశీర్వదించబడి ఉన్నారు. వృద్ధులైన, అస్వస్థులైన తల్లిదండ్రులు నీ ఇంట్లో ఉంటే వారికి సేవ చేసినందువలన నీకు దీవెన కలుగుతుంది. నీ దీవెనకు వారే కారకులౌతారు.


నీ చుట్టుప్రక్కల బీదలు లేకుంటే నీవు ఎవరిని కటాక్షిస్తావు? నీ ఆపదకాలములో యెహోవా నిన్ను ఎలా తప్పిస్తాడు? కాబట్టి మన దగ్గరకు వచ్చే ప్రతి బీదవాడు మనకు మేలు చేసేవాడైయున్నాడు. అలానే మన తల్లి దండ్రులు ఎంతకాలం మన కుటుంబములో ఉంటారో అంతకాలం మనకు ఆయుష్షు పెంచబడుతుంది.

కుటుంబం విషయంలో దేవుని ఆజ్ఞలు యేసుప్రభువు యొక్క సంకల్పం మనమందరం తెలుసుకొనవలసినవారమై యున్నాము. ద్వితీ.11:19-21 చదివితే "నీవు నీ ఇంట కూర్చుండునప్పుడు, త్రోవను నడుచునప్పుడు, పండుకొను నప్పుడు, లేచునప్పుడు వాటిని గూర్చి (దేవుని వాక్యమును) మాటలాడుచు వాటిని మీ పిల్లలకు నేర్పి నీ ఇంటి ద్వార బంధముల మీదను, నీ గవునుల మీదను వాటిని వ్రాయ వలెను. ఆలాగు చేసిన యెడల యెహోవా మీ పితరులు కిచ్చెదనని ప్రమాణము చేసిన దేశమున మీ దినములును మీ సంతతివారి దినములను భూమికి పైగా ఆకాశము నిలుచునంత కాలము విస్తరించును".

**(సశేషం)**

## ఈ నెల ప్రశ్న - నవంబర్-2025

**ఇశ్రాయేలుకు న్యాయాధిపతిగా ఉన్న తోలా ఏ గోత్రము వాడు?** (న్యాయాధిపతులు)




మీ జవాబు (రెఫరెన్సుతో సహా) ఈ నెల 15వ తేదీలోపు 9440217726 నంబరుకి వాట్సాప్ ద్వారా మాత్రమే పంపించాలి. సరైన సమాధానం పంపిన వారిలో **'లక్కీడిప్'** ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి రూ.250/-లు విలువ చేసే **'అపొస్తలుడు'** అనే పుస్తకం బహుమతిగా ఇవ్వబడుతుంది. అయితే ఈ అవకాశం కేవలం **'చందాదారులకు మాత్రమే'**. అనగా చందా చెల్లించిన వారు (చందాదారుల పట్టికలో పేరు ఉన్నవారు) ఈ ప్రశ్నకు జవాబు పంపించాలి. 15వ తేది లోపు చందా చెల్లించేవారు కూడా పాల్గొనవచ్చును. ఈ క్రింది బాక్సులో జవాబు, మీ పేరు, బుక్ సీరియల్ నంబరు వేసి ఫోటో తీసి వాట్సాప్ ద్వారా పంపించాలి. పేరు, సీరియల్ నంబరు లేకపోతే వారి పేరు లక్కీడిప్‌లో చేర్చబడదు.

జవాబు..........................................................

పేరు.............................................................

గ్రామము................బుక్ సీరియల్ నంబరు...........

**అక్టోబరు-2025 ప్రశ్న జవాబు :**
**యూఫ్రటీసు (యెహోషువ 24:2)**

(జవాబు మరియు రెఫరెన్సు తప్పని సరిగా వ్రాయాలి)

**జవాబులు పంపినవారు :**

1. జి. ఏంజల్ పౌలాస్-ఒంగోలు,
2. టి. క్రిస్టియానమ్మ- నందికొట్కూరు
3. జె. రాజకుమారి-గుంటూరు

### చందాదారుల వివరములు

| | | |
|---|---|---|
| కర్మేల్ హెల్త్‌కేర్, పులివెందుల | (08-07-25) | 5000 |
| డా॥ బి. ప్రజ్వలిత్ రూబేన్, హన్మకొండ | (12-10-24) | 5000 |
| రెవ.డా॥ వి. విజయకుమార్, బొబ్బిలి | (15-01-24) | 5000 |
| రావెల ప్రసాదరావు, గుంతకల్లు | (21-06-24) | 5000 |
| మేరిసలోమి, సిరివెళ్ళ, కర్నూలుజిల్లా | (29-11-22) | 5000 |
| బి. ప్రభువరకుమార్, రామన్నపేట | (24-06-25) | 3000 |
| కె. రజిని, నరసరావుపేట | (15-06-25) | 3000 |
| డా॥ క్రిస్టియన్ సిరప్ప, అనంతపూర్ | (06-07-24) | 3000 |
| యు. అనిత, సిరివెళ్ళ | (06-12-24) | 3000 |
| రావెల ప్రసాదరావు, గుంతకల్లు | (22-08-25) | 2000 |
| పి. జయదేవి, గుంటూరు | (03-07-25) | 2000 |
| వై. సంధ్యారాణి, ఒంగోలు | (04-01-25) | 2000 |
| పి.వి.కెరోలిన్, గుంటూరు | (11-12-24) | 2000 |
| డా॥ సిహెచ్‌కె. సుష్మప్రశాంత్, నెల్లూరు | (22-01-24) | 1500 |
| కొడవటికంటి అశోక్‌కుమార్, ఒంగోలు | (09-08-25) | 1000 |
| రావెల ప్రసాదరావు, గుంతకల్లు | (27-03-25) | 1000 |
| జి. కమలాకర్, ఒంగోలు | (03-03-25) | 1000 |
| శ్రీమతి రూతు హోసన్న, కావలి | (09-11-24) | 1000 |
| జి.మాణిక్యమ్మ అనంతపురం | (25-03-24) | 1000 |
| పి. దేవదానం, గుంటూరు | (17-10-25) | 500 |
| యం. విల్సన్ సామ్యేల్, నెల్లూరు | (08-09-25) | 500 |
| డి. శ్యామ్‌సిన్హా, బాపట్ల | (04-09-25) | 500 |
| ఆర్. జయమ్మలాబాను, గుంతకల్లు | (16-07-25) | 500 |
| జి. జార్జిథామస్, దుగ్గిరాల | (12-03-25) | 500 |
| కె. ప్రకాశరావు, నరసరావుపేట | (14-01-25) | 500 |
| బి. నెహెమ్యా, చిన్నగంజాం | (25-12-24) | 500 |
| బి. జయరావు, బుచ్చిరెడ్డిపాలెం | (06-11-24) | 500 |
| డి. నాగేశ్వరరావు, సంతరావూరు | (10-11-24) | 500 |
| కె. కమల్, మంచిర్యాల, తెలంగాణ | (14-10-24) | 500 |
| కె. ఆదిలక్ష్మి, డిస్ట్రిక్ట్ లైబ్రరి, ఒంగోలు | (24-09-24) | 500 |
| కె. ఐజక్‌సుకుమార్, ఒంగోలు | (14-08-24) | 500 |
| బి. సరోజిని, గుంతకల్లు | (06-05-25) | 400 |
| కె. మార్టిన్‌మధుచరణ్, పులివెందుల | (18-10-25) | 350 |
| టి. క్రిస్టియానమ్మ, నందికొట్కూరు | (08-09-25) | 350 |
| పి. స్వప్న, పాల్వంచ | (09-08-25) | 350 |
| మారనాత బైబిల్ సెమినరీ, విజయవాడ | (06-08-25) | 350 |
| జి. ఏంజల్ పౌలాస్- ఒంగోలు | (02-08-25) | 350 |
| జి. రవి, వేల్పూరు | (12-07-25) | 350 |
| స్వయంప్రభ, చిలకలూరిపేట | (14-06-25) | 350 |
| యస్. రాజశేఖర్, కర్నూలు | (04-06-25) | 350 |
| జి. దేవదాసు, నంద్యాల | (05-04-25) | 350 |
| జి. కళావతి జాకబ్, ఒంగోలు | (03-04-25) | 350 |
| ఆర్.ఆర్.కె.పీటర్-విశాఖపట్నం | (23-03-25) | 350 |
| పి. జాన్‌బాబు-గోపాలపురం | (21-03-25) | 350 |
| ఎ. ప్రభుచరణ్-జగిత్యాల | (19-03-25) | 350 |
| పి. నీలిమారాజారత్నం, ఉయ్యూరు | (14-03-25) | 350 |
| యస్. గోపి, పార్వతిపురం | (17-12-24) | 350 |
| బి. రవికుమార్, హైదరాబాద్ | (20-11-24) | 350 |
| సిహెచ్. శైలజ, విజయవాడ | (04-04-25) | 200 |

చిన్నపిల్లల పేజి

# తగిన సమయం

ఇంట్లోకి వస్తున్న కూతుర్ని చూసి సండేస్కూల్లో ఏమి చెప్పారో అడిగింది కమల. ఇంటి గుమ్మంలోని చెట్టుకు ఉన్న సీతాఫలం చూస్తూ సమాధానం చెప్పింది లిఖిత. లిఖితకు సీతాఫలం అంటే ఎంతో ఇష్టం.

ఒక రోజు లిఖిత స్కూల్ నుండి వస్తూనే, మమ్మీ నేను సీతాఫలం కోస్తాను అంది. అది ఇంకా పండలేదు, కోయవద్దన్నది. లిఖిత కోపంగా ఎంత కాలం నుంచి ఇదే మాట చెప్తున్నావు మమ్మీ, నా ఫ్రెండ్స్ చెప్పారు సీతాఫలాన్ని బియ్యం బస్తాలో కాని, డబ్బాలో కాని వేసి ఉంచితే వారం రోజుల్లోనే మగ్గుతుందట అంది. అలా చేయడానికి కూడా ఇంకా టైం ఉంది అని అంటూ ఉండగనే సీతాఫలం కోసి తెచ్చి తల్లికి చూపిస్తూ మమ్మీ దీన్ని బియ్యం బస్తాలో వేయనా? అడిగింది లిఖిత. నీ ఇష్టం అంది తల్లి లిఖిత వైపు చూడకుండానే.

తల్లి తనమీద కోపంగా ఉందని గ్రహించిన లిఖిత సారీ మమ్మీ, అసలేం జరిగిందంటే లల్లీ వాళ్ళ పెరట్లో కాసిన సీతాఫలం చాలా తియ్యగా ఉంటుందని, అంత తియ్యటి సీతాఫలం ఇంకెక్కడ దొరకదని రోజు గొప్పలు చెప్తుంది, దాని గొప్పలు తట్టుకోలేక మాచెట్టు సీతాఫలం ఇంకా తియ్యగా ఉంటుంది అన్నాను. లల్లీ అన్నింటిలో తానే గ్రేట్ అన్నట్లు ఒకటే గొప్పలు చెప్పుకుంటుంది. ఈ సారి ఎలాగైనా సరే నేనే దానికంటే గ్రేట్ అనిపించుకోవాలి అన్నది.

రోజూ స్కూల్ నుండి రాగానే సీతాఫలం పండిందో లేదో చూడడమే లిఖిత మొదటి పని. రోజు చూస్తున్న ఆ సీతాఫలం పండుతున్న ఆనవాలే లేదు. అయినా లిఖిత నిరాశ చెందక రేపు పండుతుందేమో అని ఎదురు చూడసాగింది. ప్రతిరోజువలె ఒక రోజు సీతాఫలం కొరకు బియ్యం బస్తా తెరచి చూడగా, ఎండిపోయి నల్లగా ఉన్న సీతాఫలంను చూసి ఏడుపు ఆగలేదు లిఖితకు. కమల లిఖిత కన్నీళ్ళు తుడుస్తూ నేను ముందే చెప్పాను కదా, అప్పుడే కోయవద్దు అని నా మాట వినలేదు. దేవుడు ప్రతి పనికి ఒక సమయం పెట్టాడు. ఆ సమయం దాకా వేచి చూడాలి. దేవుడు నియమించిన కాలానికి ముందుగా మనం ఏమి చేయలేము. చేసినా అది ఈ ఎండిపోయిన సీతాఫలం వలె ఎవరికి ఉపయోగపడదు. చెట్టు ఎవరి పెరట్లోదైనా పండులో తియ్యదనాన్ని కలిగించేది దేవుడు. కాబట్టి ఎవరి చెట్టు ఫలం తియ్యగా ఉన్నా ఆ గొప్పదనం మనది కాదు దేవునిది అన్నది కమల.

తన తప్పు గ్రహించిన లిఖిత మారుమాట్లాడలేదు. సీతాఫలం లేకుండా స్కూల్‌కి ఎలా వెళ్ళాలి? లల్లీ అందరి ముందు గేలి చేస్తుంది. మామూలుగానే దాని గొప్పలు తట్టుకోలేము. అందరితో గ్రేట్ అనిపించుకుందాము అనుకొని ఫూల్ అయ్యాను అనుకుంటూ డల్‌గా స్కూల్‌కి రెడీ అవుతున్న లిఖితకు లంచ్‌బాక్స్ పక్కనే ఉన్న సీతాఫలం చూడగానే ఎక్కడలేని సంతోషం కలిగింది. తల్లికి థ్యాంక్స్ చెప్పి స్కూల్‌కి బయలు దేరింది లిఖిత.

సీతాఫలం తిన్నవారందరూ లల్లీ వాళ్ళ పెరట్లో సీతాఫలం కంటే లిఖిత తెచ్చిన ఫలమే తియ్యగా ఉంది అన్నారు. లిఖిత, లల్లీ దగ్గరకు వెళ్ళి చెట్టు ఎవరిదైనా పండుకు ఆ తియ్యదనం ఇచ్చేది దేవుడు మనం కాదు కాబట్టి, మనం గొప్పలకుపోక దేవునికి థ్యాంక్స్ చెప్పాలి అన్నది నవ్వుతూ. అటుగా వెళ్తూ ఆ మాటలు విన్న లిఖిత క్లాస్ టీచర్ లిఖిత చెప్పిన చక్కని మాటలను అసెంబ్లీలో చెప్పి లిఖితను పొగిడి పిల్లలందరిచే చప్పట్లు కొట్టించింది. ఆ కరతాళ ధ్వనులకు లిఖితకు చెప్పలేని సంతోషం కలిగింది.

***కంఠస్థము చేయవలసిన వాక్యము: దేవుడు తగిన సమయమందు మిమ్మును హెచ్చించునట్లు ఆయన బలిష్ఠమైన చేతిక్రింద దీనమనస్కులై యుండుడి. 1పేతురు 5:6***

(12వ పేజీ తరువాయి...)

10. నేను ద్రాక్షావల్లిని యోహాను 14:26

11. నేనే మార్గం సత్యం జీవం యోహాను 11:25

12. నేను లోకాన్ని జయించాను యోహాను 16:33

ఇన్ని వాగ్దానాలిచ్చిన యేసు పునాదులుగల పట్టణ వారసులను చేసారు. హల్లెలూయా.

నేను నా భార్య క్రీస్తులో సహ విశ్వాసులుగా మా నమ్మకాన్ని, మేము చదివేపుస్తకాలు చూస్తూ స్వాతి, సుగుణ, శాంతి, కోడళ్ళు కుమార్తెలు విశ్వాసంలోకి సుళువుగా వచ్చేసారు. కుమారులు కూడా నమ్మారు. ప్రతి ఒక్కరికి ప్రత్యేక సాక్షముంది. మేమంతా ఇహ లోకం తర్వాత దేవుని రాజ్యంలో తండ్రితో నివాసం చేయ గలమనే నిరీక్షణ ఉంది.

నా షాపులో చెక్కలపై దైవ వాక్యాలు పెయింటింగ్‌తో వ్రాయించి ఉంచాను. పరలోక ప్రార్థన, పది ఆజ్ఞలు, విశ్వాస ప్రమాణము, సిలువలో పలికిన ఏడు మాటలు అనేకులకు మౌనంగా సందేశాన్నిస్తున్నాయి. మా షాపులో కొనుగోలు చేయువారి సంచులపై దైవ వాక్యం ముద్రించాను. మా అందరి జీవితాలను నిశ్చింతగా ఆయన చేతులకు అప్పగించాము. మా బ్రతుకులో ఏమి చేసిన ప్పటికీ తృప్తిగా ఉంటాము. హుందాగా లోకం ఎదుట సాక్ష్యమిస్తాము. క్రీస్తే నిజ రక్షకుడు అని యితరులకు చెప్తాము. దేవునికి స్తోత్రము.

## గమనిక

**దయచేసి పత్రిక కొరకు మీరు పంపించే చందా మనియార్డర్ ద్వారా పంపదలుచుకుంటే ఈ క్రింద అడ్రసుకు పంపగలరు.**

**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర,**
**ఎడిటర్, హన్నాకృప ఆధ్యాత్మిక మాసపత్రిక**
**6వ లైను, క్లౌపేట, ఒంగోలు-523001**
**ప్రకాశం జిల్లా, ఫోన్: 9440217726**

## బైబిల్ పద వినోదము-10 జవాబులు

| | | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| ఎ | ఎం | దు | హి | స్సో | పు | బు | క | న | గా | బా | దే | వు | ని | సి |
| లీ | ల | మి | బ | మై | వ | దా | జీ | స | తి | ని | ము | క్య | పో | వా |
| షె | ము | గ | ద్యా | ల | దై | నా | రెం | డం | న్న | స | చు | రా | లు | గ |
| బ | ద్గ | ఖ | టి | ను | స్గా | పి | తె | ఎ | సు | లు | వం | టు | యె | ల |
| బ | య | ల్సె | ఫో | ను | ము | కం | గు | లి | టె | మొ | ను | క | నా | ను |
| బు | రే | హో | ఉం | కూ | గా | డి | ళ్ళ | యా | ర | వా | ను | రో | హ | అ |
| డి | అ | ర | ణ్య | ము | షు | ప్రా | ణా | జ | త్మ | తు | ల | యి | ను | కీ |
| లు | మం | దు | చు | న్న | పొ | ద | లే | రు | మూ | క్కో | ను | ళ్ళ | త్రో | పీ |
| అ | గ | రు | జె | యె | లీ | ఎ | ను | వి | వి | సు | భ | జిం | చు | తో |
| మ్రా | ము | న | ఠి | క | ట్టు | ప | మ | ఫీ | నె | హో | సు | త | నం | ము |
| ము | సు | కు | ఈ | ము | దూ | రు | స్కా | చు | ఇ | శ్రా | యే | లీ | యు | లు |
| లం | సే | త | తా | ర్షో | క్క | యొ | దు | ము | డు | మో | య | ఫ | ద | హ్రూ |
| పు | మ | ల | మా | గె | ను | హా | బె | ఆ | కు | లో | షే | చ | రో | ము |
| నె | రా | పూ | రు | ధిం | బీ | శో | కె | హూ | త్వి | ను | ల | షి | న | ర్యా |
| బో | చు | చు | యా | అ | న్న | ది | యో | రు | సా | ఐ | గు | ప్తు | ఫ్రా | మి |

**జవాబులు పంపినవారు :**

1. కె. ప్రభాకర్-వెంకటగిరి, 2. కె. సత్యశైలజ-బొమ్మూరు, 3. యం. స్వయంప్రభ-చిలకలూరిపేట, 4. కె. సుభద్ర -విజయవాడ, 5. జె. రాజకుమారి-గుంటూరు, 6. పి. ప్రభుకుమార్-ఒంగోలు, 7. కె. చిన్నయోసేపు-దోర్నాల, 8. టి. యేసుదయమ్మ-వలపర్ల, 9. టి. క్రిస్టియానమ్మ-నందికొట్కూరు, 10. దయరాజు- రామానుజపురం, 11. జి. మేరి కేథరిన్-ఒంగోలు, 12. కె. లలితాభాగ్యం-కనిగిరి, 13. కె. యేసురత్నం- ఒంగోలు, 14. పి. విజయకుమారి -ఒంగోలు, 15. జి. ఏంజల్ పౌలాస్-ఒంగోలు, 16. కె. సుభద్ర -విజయవాడ


## కొడవటికంటి రచనలు

**అపొస్తలుడు -** **రూ. 250/-**
(అపొస్తలుడైన పౌలు కథ - నవల)

**జప్నత్పనేహు -** **రూ. 250/-**
(యోసేపు కథ - నవల)

**నా చిత్తానుసారుడు** **రూ. 250/-**
(దావీదు కథ - నవల)

**మిక్కిలి సాత్వికుడు** **రూ. 150/-**
(మోషే కథ - నవల)

**గోత్రకర్త** (యాకోబు కథ-నవల) **రూ. 250/-**

# భైబిల్ పద వినోదం - 11

## ఇశ్రాయేలీయుల అరణ్య ప్రయాణం

ఈ క్రింది పదాలను ప్రక్కనున్న అక్షరాలలో వెదకండి. పదాలు అడ్డంగా, నిలువుగా, క్రాస్‌గా ఉండవచ్చు, కానీ పదాలు ఒకదాని మీదగా ఇంకొకటి గుర్తించ కూడదు. గుర్తించిన క్రింది పదమును (✓) టిక్ పెట్టండి. మిగిలిన అక్షరాలను ఎడమ నుండి కుడికి, కుడి నుండి ఎడమకు సమకూర్చి వచ్చిన వాక్యమును క్రింద బాక్స్‌లో వ్రాయండి.

| | | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| ము | శె | పా | నీ | ఆ | ను | వు | పా | నీ | మ | ఓ | దే | లు | గ్దో | మి |
| ట | రు | మా | వా | జ్ఞ | తా | హో | రా | యె | న | స్సా | గు | దై | పీ | వు |
| షూ | శ్ర | మ | ద | లు | దా | ద్ధ | ను | ము | ఠ | పీ | లి | బ | హ | రె |
| నే | న్నా | డు | హ | నే | ని | హో | వి | భం | స్తం | ప | దీ | గా | హీ | ఫీ |
| ను | నీ | సీ | న | కు | రే | క | రు | ణా | పీ | ఠ | ము | ళ్ళు | రో | దీ |
| మె | న్న | నా | బ | బు | చు | చు | పిం | మా | రా | జ్ఞా | ఆ | రే | తు | ము |
| ఆ | రీ | యి | లి | య | కి | ఆ | హో | లి | యా | బు | న | పూ | ఆ | జ్ఞ |
| ను | అ | బా | ని | మే | బ్రో | టి | బె | స | లే | లు | న్ని | న | న | ల |
| రా | బే | త | ను | ఘ | తు | కో | స | రిం | చి | న | గో | డు | వె | చు |
| ల | డ | సీ | ము | స్తం | హ | యె | ర | న | ము | ము | షె | ని | కొ | దీ |
| హో | నీ | దే | తా | భం | త్తా | వు | ము | హు | ద్ర | స | ను | దై | న | యె |
| మీ | రు | మి | ఏ | భూ | వా | ఏ | రా | వా | ము | ద | హో | సీ | హో | ను |
| ద | ను | దు | న్న | స | మ | లీ | బీ | స్త | స | మం | జ | న | ము | ము |
| ని | టె | ఫో | శా | ప | ము | ము | అ | కం | ్ర | షు | దే | కా | ల | త్తీ |
| న్ను | హె | ఏ | చ్ఛిం | చు | అ | గ్ని | స్తం | భం | ఎ | ఓ | మె | రు | ను | షి |

పేరు.............................. గ్రామము..............................

అడ్రస్ లేబుల్ మీద ఉన్న బుక్ సీరియల్ నంబరు..............................

**'బైబిలు పద వినోదము-11'** పూర్తి చేసిన తర్వాత పేరు, ఊరు, అడ్రస్ లేబుల్ మీద ఉన్న బుక్ సీరియల్ నంబరు వ్రాసి ఈ పేజీని ఫోటో తీసి 9440217726 నంబరుకి వాట్సాప్ ద్వారా పంపగలరు లేదా ఈ పేజీని జెరాక్స్ తీసి **15వ తేదీలోగా** మా అడ్రసుకు పంపగలరు. సీరియల్ నంబరు వేయకపోతే వారి పేరు ప్రచురింపబడదు.

| | | | | | |
|---|---|---|---|---|---|
| గోషెను | ఏలీము | ఆజ్ఞలు | మస్సా | పాళెము | పూరేళ్ళు |
| దీవెన | కరుణాపీఠము | ఏతాము | మన్నా | బెసలేలు | కోరహు |
| దహనబలి | అగ్నిస్తంభం | ఓమెరు | బలిపీఠము | దాతాను | శాపము |
| మేఘస్తంభం | మందసము | దీపస్తంభం | అబీరాము | పీహహీరోతు | సీను |
| ఆహోలీయాబు | హోరు | మిగ్దోలు | హోరేబు | ఏఫోదు | మెరీబా |
| ఎర్రసముద్రము | రెఫీదీము | పారాను | ఓగు | మారా | కాదేషు |
| తబేరా | సీహోను | షూరు | సీనాయి | కిబ్రోతుహత్తావా | షిత్తీము |

**పై పదాలను గుర్తించిన తర్వాత మిగిలిన అక్షరాలను సమకూర్చి, వచ్చిన వాక్యమును ఇక్కడ వ్రాయండి.**

_ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _

(ద్వితీ. 28:1)

_ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _